


# భారత్ ప్రతినిధి

తెలుగు దిన పత్రిక








సంపుటి: 3 సంచిక: 277 పేజీలు: 8 సంపాదకులు: రోళ్ళ రఘునాథ్ రెడ్డి ప్రచురణ: గుంటూరు శుక్రవారం, 31 జూలై 2026 వెల: 2 రూ/- RNI No: APTEL/2023/88990

VOLUME: 3 ISSUE: 277 PAGES: 8 EDITOR: ROLLA RAGHUNATH REDDY PUBLISHED: GUNTUR FRIDAY, 31 JULY 2026 PRICE: 2 Rs/- BHARATH PRATHINIDHI




## పరామర్శ పేరుతో గొడ్డలి పార్టీ డ్రామాలు

బలప్రదర్శన కోసమే జగన్ పర్యటన

మహిళా ఎస్ఐపై అనుచిత ప్రవర్తన దారుణం

జగన్ తీరుపై మండిపడ్డ హోంమంత్రి అనిత



## రాజధాని ఎక్కడో చెప్పకుండా పంపించేశారు

ఆ కసితోనే రాష్ట్ర అభివృద్ధికి పూనుకున్నాం

ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

ఆదోనిలో చిన్నారుల కోర్కె నెరవేర్చిన మంత్రి

ఏపీకి పరిశ్రమలు వస్తున్నాయని అంటే అందులో ఆ శాఖ మంత్రి టీజీ భరత్ కృషి ఎంతో ఉందని తెలిపారు. ఓ పట్టుదలతో తామంతా పనిచేస్తున్నామని అన్నారు. రిలయన్స్, ఫార్మాతోపాటు ఇతర పరిశ్రమలు కర్నూలు జిల్లాకు వస్తున్నాయని ఆయన వివరించారు. పట్టుదలతోపాటు క్రమశిక్షణతో పనిచేయాలని ఈ సందర్భంగా యువతకు మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు.

## పవన్‌తో మంత్రి నిమ్మల భేటీ

ఎల్‌నినోపై ఇరు నేతల చర్చ ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలన్న పవన్



అమరావతి: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం భేటీ అయ్యారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితులపై చర్చించారు. సూపర్ ఎల్‌నినో, తద్వారా రాష్ట్రంలో నెలకొన్న సాగు నీటి సంక్షోభంపై రైతుల్లో అవగాహన కల్పించాలని పవన్ సూచించారు. రైతులతో ప్రత్యక్ష సమావేశాలు నిర్వహించి పరిస్థితులను వివరించాలన్నారు. సంక్షోభ నివారణకు ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణపై దృష్టి సారించాలని అన్నారు. ఏలేరు ప్రాజెక్టు నుంచి 1,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినందుకు నిమ్మలకు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు.నీటి విడుదలతో పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట రైతులకు సాగునీటి సమస్యకు ఊరట లభించిందని పవన్ అన్నారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంపై గ్రామస్థాయిలో ప్రచారం చేపట్టాలని సూచించారు. ప్రతి రైతు పీఎం ఫసల్ బీమా యోజనలో చేరేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం ప్రతి నీటి బొట్టు విలువైనదే అని... నీటి వృథాను అరికట్టాలని చెప్పారు. కాలువల్లో పూడిక తొలగింపు, నీటి గట్టుల లీకేజీల నివారణపై దృష్టి సారించాలన్నారు. కాకినాడ జిల్లా, పిఠాపురంపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినోపై రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచనలు చేశారు. ఈ సందర్భంగా భుజం శస్త్రచికిత్స చేయించుకున్న పవన్‌ను మంత్రి నిమ్మల రామానాయుడు పరామర్శించారు. త్వరగా కోలుకుని ప్రజాసేవలో మరింత చురుగ్గా పాల్గొనాలని నిమ్మల ఆకాంక్షించారు.



## మహిళా ఎస్సై పట్ల వైకాపా నేతల తీరు దారుణం

జగన్ కాన్వాయ్ కోసం ఇంత హంగామా చేయడమా

మండిపడ్డ మంత్రి పార్థసారథి





ప్రధాని పదవికి మోడీ రాజీనామా చేస్తేనే మంచిది

రాష్ట్రాల్లో విద్యార్థులను వేధిస్తే మళ్లీ ఆందోళన తప్పదు

కాక్రోచ్ చీఫ్ అభిజిత్ దీప్కే హెచ్చరిక

## మోడీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలి



## ఉత్తరాంధ్రకు మకుటాయమానం.. భోగాపురం విమానాశ్రయం

ఆంధ్రుల సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా రూపుదిద్దుకున్న టెర్మినల్ గ్లోబల్ ఇమేజ్‌కి చిరునామా భోగాపురం ఎయిర్‌పోర్ట్

-మంత్రి కందుల దుర్గేష్

## సిదిరితో జగన్ ములాఖత్ రద్దు

సాయంత్రం 5 తరవాత జైలు వద్దకు జగన్

నిబంధనల మేరకు ములాఖత్ కుదరదని తేల్చిన సిబ్బంది

శ్రీకాకుళం: వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుతో వైఎస్ జగన్ ములాఖత్‌కు జైలు అధికారులు అనుమతి నిరాకరించారు. నిర్ణయించిన సమయం ముగిసిన తర్వాత జైలు వద్దకు చేరుకోవడంతో, జైలు నిబంధనల ప్రకారం అధికారులు అనుమతి ఇవ్వలేదు. సాయంత్రం 5 గంటల తర్వాత సీదిరి అప్పలరాజును కలిసేందుకు వైసీపీ నేతలు అనుమతి కోరారు. ఈ విషయంపై జైలర్.. ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరపగా, జైలు నిబంధనల ప్రకారమే వ్యవహరించాలని అధికారులు స్పష్టం చేశారు. సాయంత్రం 5 గంటలలోపే ములాఖత్‌కు అనుమతి ఉంటుందని తెలిపారు. దీంతో జగన్ అప్పలరాజు ములాఖత్‌కు అనుమతి లభించలేదు. ఇకచేసేది లేక జైలు వద్ద అప్పలరాజు కుటుంబ సభ్యులను జగన్ పరామర్శించారు. అంతకుముందు విశ్వాఖ చేరుకున్న జగన్ అక్కడి నుంచి రోడ్డు మార్గంలో శ్రీకాకుళం చేరుకున్నారు. ప్రస్తుతం అంపోలు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును ఆయన జైలులో ములాఖత్ ద్వారా పరామర్శించాలనుకున్నారు.



వందేమాతరం గీతానికి పార్లమెంట్ ఆమోదం

లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లు






## పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

దశలవారీగా అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ

## పంపులను ఆన్ చేసి జలాశయాలను నింపాలి

రిజర్వాయర్‌లను నింపాలనే సోయి రాకపోతే ఎలా

ప్రభుత్వ తీరుపై మండిపడ్డ మాజీమంత్రి శ్రీనివాసగౌడ్

తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూరాల నుంచి కిందున్న అన్ని రిజర్వాయర్లు, అన్ని పంప్‌సెట్లు ఆన్ చేసుకోవాలి.. అన్ని రిజర్వాయర్లు నింపుకోవాలి.. తాగునీటి అవసరాలకు మాత్రమే మేం నీళ్లిస్తాం.. వ్యవసాయానికి నీళ్లివ్వం అనే ధోరణిలో అధికారులు మాట్లాడుతున్నారు.





## ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు

పొంగిపొర్లుతున్న వాగులు వంకలు

ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి, ప్రాణహిత నదులు

మేడిగడ్డ వద్ద వరద ఉధృతితో 85 గేట్లు ఎత్తివేత

శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పెరిగిన వరద ఉధృతి

కడెం జలాశయానికి భారీగా వరదనీరు చేరిక

భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి మట్టం

ములుగు జిల్లా బొగత జలపాతం సందర్శన నిలిపివేత

# పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

భద్రాద్రి కొత్తగూడెం: పేదలకు ఇంటిచింత లేకుండా చేయాలనే ఇందిరమ్మ ఇళ్లను పెద్ద ఎత్తున నిర్మిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. విడతల వారీగా పేదలందరికి ఇంటికలను సాకారం చేస్తామని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల మేర అప్పులు చేసిందని, పీకల్లోతు కష్టాల్లో ఉన్నప్పటికీ ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం జిల్లాలోని చంద్రుగొండ మండలం మంగయ్య బంజర గ్రామంలో 45 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్, లో - లెవల్ కాజ్‌వేను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు, రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామన్నారు. రెండో విడతలో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. దీంతో రెండు దఫాలుగా ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లను పేదవారికి మంజూరు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు. మూడు, నాలుగో విడతలో ప్రతి ఒక్క అర్హుడైన పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కులం, మతం, పార్టీ అని చూడటం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తున్న ఈ ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# పంపులను ఆన్ చేసి జలాశయాలను నింపాలి

హైదరాబాద్: గోదావరి, కృష్ణా నదుల ఎగువన కురుస్తున్న వర్షాలతో భారీగా వరద వచ్చి చేరుతోంది. కానీ ప్రాజెక్టులలోని అన్ని పంపులను ఆన్ చేసి, రిజర్వాయర్లను నింపుకోవాలనే సోయి ఈ
కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూరాల నుంచి కిందున్న అన్ని రిజర్వాయర్లు, అన్ని పంప్‌సెట్లు ఆన్ చేసుకోవాలి.. అన్ని రిజర్వాయర్లు నింపుకోవాలి.. తాగునీటి అవసరాలకు మాత్రమే మేం నీళ్లిస్తాం.. వ్యవసాయానికి నీళ్లివ్వం అనే ధోరణిలో అధికారులు మాట్లాడుతున్నారు. దాదాపు నిన్న 45-50 వేల క్యూసెక్కుల పవర్ జనరేషన్ పేరు మీద నీళ్లు వదులుతున్నరు.. కానీ ఉన్న రిజర్వాయర్లను నింపాలి.. పంపులు ఆన్ చేయాలనేది మాత్రం విస్మరించారని అన్నారు. గోదావరి, కృష్ణా నదుల ఎగువన కురుస్తున్న వర్షాలతో భారీగా వరద వచ్చి చేరుతోంది. కొన్ని పంపులు ఆన్ చేశారు.. మరికొన్ని చేయలేదన్నారు. నీళ్లు వచ్చినప్పుడు ఒడిసి పట్టుకోవాలి కానీ వదలన్నీ బంద్ అయినప్పుడు ఏం చేస్తరని ప్రశ్నించారు. వరదలు వచ్చి జూరాల నిండుతున్నా పంపులు ఆన్ చేయలేదన్నారు. రైతులంతా ధర్నా చేస్తం.. మేమే ఆన్ చేసుకుంటమని ధర్నా చేస్తే నిన్న ఆన్ చేశారు. ఇన్‌ఎ÷-లో ఎంత ఉందో అవుట్ ఎ÷-లో కూడా అంతే పవర్ జనరేషన్ పేరు మీద మొత్తం కింది వెళ్లిపోతున్నయన్నారు. ఎల్ నినో దృష్ట్యా గోదావరి, కృష్ణా నదుల నుండి కిందకి వృథాగా పోతున్న ప్రతి చుక్కను ఒడిసి పట్టుకోవాల్సిన అవసరం ఉంది. సరైన సమయంలో స్పందించకపోతే పాలమూరు ఎడారి కాక తప్పదని అధికారులు, ప్రభుత్వానికి హెచ్చరించారు.

# పరామర్శ పేరుతో గొడ్డలి పార్టీ డ్రామాలు

అమరావతి:మాజీ మంత్రి సిదిరి అప్పలరాజుకు పరామర్శ పేరుతో గొడ్డలి పార్టీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఏపీ హోంమంత్రి అనిత మండిపడ్డారు. గురువారం రాజధాని అమరావతిలో ఆమె మాట్లాడుతూ.. పరామర్శ పేరుతో గొడ్డలి పార్టీ డ్రామాలు ఆడుతోందని విమర్శించారు. జైలు నిబంధనలు వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌రెడ్డికి తెలుసునని పేర్కొన్నారు. కానీ కావాలనే ములాఖత్ సమయం పూర్తయ్యాక జైలు వద్దకు ఆయన వెళ్లారని ఆరోపించారు. శ్రీకాకుళంలో మహిళా ఎస్సైపై వైకాపా నేతల దాడిని మహిళా లోకం ఖండించాలని రాష్ట్ర హోంమంత్రి అనిత అన్నారు. విధుల్లో ఉన్న మహిళా ఎస్సైపై జుగుప్సాకరంగా ప్రవర్తించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల పట్ల గొడ్డలి పార్టీ నేతల తీరు మారాలన్నారు. వైకాపా నేత సీదిరి అప్పలరాజుతో ములాఖత్‌కు సమయానికి వెళ్లకుండా జగన్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సీదిరి అప్పలరాజును కలవాలనుకుంటే ములాఖత్ సమయానికే జగన్ వెళ్లాలి. సమయానికి వెళ్లకుండా రాజకీయాలు చేస్తున్నారు. నిజానికి అప్పలరాజును కలవాలన్న ఆలోచన జగన్‌కు లేదు. ములాఖత్‌కు మధ్యాహ్నం 2-3 గంటల మధ్య అధికారులు సమయం ఇచ్చారు. సాయంత్రం 5 తర్వాత జగన్ వెళ్తే అర్థమేంటి? కేవలం బలప్రదర్శన ఆలోచనే ఆయనకు ఉంది. మహిళా ఎస్సై పట్ల సొంత పార్టీ నేతలు ప్రవర్తించిన తీరుకు జగన్ క్షమాపణ చెప్పాలని అనిత డిమాండ్ చేశారు. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళానికి బల ప్రదర్శన చేసుకుంటూ వైసీపీ అధినేత వెళ్లారని వివరించారు. అయితే జగన్ పర్యటనలో పోలీసులు ఎవరినీ ఇబ్బంది పెట్టలేదని గుర్తు చేశారు. మహిళా ఎస్ఐ పట్ల వైసీపీ నేతలు దురుసుగా ప్రవర్తించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎస్ఐపై దురుసుగా ప్రవర్తించినవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అప్పలరాజు కుమారుడు తప్పు చేసినందుకే కేసు పెట్టారని హోం మంత్రి అనిత గుర్తు చేశారు. ఆసుపత్రిలో ఉన్న తన చెల్లిని పరామర్శించడానికి సమయం ఉండదు కానీ.. హిట్ అండ్ రన్ కేసును తారుమారు చేసేందుకు ప్రయత్నించిన మాజీ మంత్రిని పరామర్శించడానికి మాత్రం సమయం ఉంటుందని ఎద్దేవా చేశారు. వక్ర బుద్ధి.. డైవర్షన్ పాలిటిక్స్ చేయడం కోసమే వైఎస్ జగన్ ఇదంతా చేశారని వ్యంగ్యంగా అన్నారు హోం మంత్రి అనిత.

# మహిళా ఎస్సై పట్ల వైకాపా నేతల తీరు దారుణం

అమరావతి: శ్రీకాకుళంలో మహిళా ఎస్సై పట్ల వైకాపా నేతల తీరును మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రంగా ఖండించారు. వైకాపా నేతలు పోలీసులపై దాడి చేసే స్థాయికి వచ్చారన్నారు. రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వ్యక్తి కుటుంబసభ్యులను జగన్ పరామర్శించాల్సింది పోయి.. ఎవరి కోసం వెళ్లారని ప్రశ్నించారు. జగన్ వెళ్లే మార్గంలోనే భోగాపురంలో ప్రధాని మోదీ పర్యటన ఉంది. ప్రధానికి భద్రత కల్పించే దారిలో ఆందోళనలు చేయకూడదు. భద్రతా కారణాల రీత్యా జగన్ పర్యటనలో ధర్నాలు, ర్యాలీలు, సభలకు అనుమతి లేదు. భయపెట్టి అధికారంలోకి వచ్చేందుకు జగన్ యత్నిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలకు తావులేదు. రెండేళ్లుగా ఆయన పర్యటనలను చూస్తున్నాం. భయానక వాతావరణం కల్పించడమే జగన్ లక్ష్యం. ప్రధాని మోదీ పర్యటనను పక్కదారి పట్టించడమే ఆయన ఉద్దేశం. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం హైవేపై 120 కి.మీ. దూరం వెళ్లేందుకు 6 గంటలు అవసరమా అని పార్థసారథి ప్రశ్నించారు. మహిళలంటే వైకాపా నేతలకు ఎప్పుడూ గౌరవం లేదని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఎవరైనా బాధితులను పరామర్శిస్తారని.. జగన్ మాత్రం నిందితుల వద్దకు వెళ్లారని విమర్శించారు. జగన్ ఎప్పుడూ నేరగాళ్లనే సమర్థిస్తారన్నారు.

# ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు



హైదరాబాద్: వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కారణంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలాగే రానున్న మరో మూడు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తెలంగాణ వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు నదులు, ఉపనదులు పొంగిపొర్లుతున్నాయి. ముఖ్యంగా తెలంగాణ, మహారాష్ట్రల్లోని ఎగువ ప్రాంతాల్లో వర్షాపాతం తీవ్రమవడంతో గోదావరి, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో రాష్ట్రంలోని పలు కీలకమైన నీటిపారుదల ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో జలాశయాలు సంతరించుకుంటున్న జలకళ రైతుల్లోనూ, ప్రజల్లోనూ తీవ్ర ఆనందాన్ని నింపుతోంది. నిజామాబాద్ జిల్లాలోని ప్రతిష్టాత్మక శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం జలాశయంలోకి 12,900 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, ప్రాజెక్టు నీటి నిల్వ 17.103 టీఎంసీలకు చేరింది. కాకతీయ కాలువ ద్వారా దిగువకు 300 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. అలాగే, నిర్మల్ జిల్లాలోని సారంగాపూర్ మండలంలో ఉన్న స్వర్ణ ప్రాజెక్టుకు ఉదయం వేళకు నీటి సామర్థ్యం అర టీఎంసీ దాటి, ఇన్ ఫ్లో దాదాపు 10 వేల క్యూసెక్కులకు చేరింది. నిర్మల్ జిల్లాకే తలమానికమైన కడెం ప్రాజెక్టుకు వరద నీరు విపరీతంగా పోటెత్తుతోంది. ఉదయం 11:00 గంటల సమయానికి కడెం ప్రాజెక్టుకు ఏకంగా 77,442 క్యూసెక్కుల భారీ ఇన్ ఎ÷-లో నమోదు కాగా, పరిస్థితికి అనుగుణంగా అధికారులు 6 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఇక జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం వద్ద ప్రాణహిత, గోదావరి ఉభయ నదులు పరవళ్లు తొక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అక్కడ నీటిమట్టం 6.320 మీటర్ల ఎత్తులో మెట్ల వద్దకు చేరడంతో తీరం కొత్త రూపు సంతరించుకుంది. గోదావరి జలాలు పోటెత్తడంతో కాళేశ్వరం ప్రాజెక్ట్ లోని మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ కి ఇన్ ఫ్లో భారీగా పెరిగింది. ఎన్డీఎస్ఏ సూచనలను పాటిస్తూ అధికారులు బ్యారేజ్ కి చెందిన మొత్తం 85 గేట్లను ఎత్తి ఉంచారు. ప్రస్తుతం అక్కడ ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో సమంగా 1,01,530 క్యూసెక్కులుగా కొనసాగు తుండటంతో గోదావరి ప్రవాహం దిగువకు వేగంగా పయనిస్తోంది. ప్రాజెక్టుల్లో క్రమంగా నీటి నిల్వలు పెరుగుతుండటంతో నీటిపారుదల శాఖ అధికారులు పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురియ నుండటంతో 9 జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఉమ్మడి కరీంనగర్, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు భారీ వర్షాల నేపథ్యంలో 6 జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. భారీ వర్షాలకు ఉత్తర తెలంగాణతో పాటు నిజామాబాద్ జిల్లాలోని చెరువులు, కుంటలు అలుగుపోస్తున్నాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షాలను దృష్టిలో పెట్టుకొని జగిత్యాల జిల్లాలో పాఠశాలలకు సెలవను ప్రకటించారు. ఈ సీజన్‌లో తొలిసారిగా జూరాల ప్రాజెక్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదలారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితోపాటు,
పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు గోదావరిలో నీటిమట్టం పెరుగుతోంది. గురువారం ఉదయానికి 27 అడుగులకు చేరింది. నీటిమట్టం ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టుకు వరద పోటెత్తున్నది. దీంతో అప్రమత్తమైన ప్రాజెక్టు అధికారులు ప్రాజెక్టు 6 వరద గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఇన్ ఫ్లోగా ప్రాజెక్టులోకి 77,442 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు 6 వరద గేట్లు 10 ఫీట్లు గేట్లు ఎత్తి అవుట్ ఎ÷-లోగా 67, 000 క్యూసెక్కుల నీటిని దిగవనున్న గోదావరిలోకి అధికారులు వదులుతున్నారు. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు 3.495 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి మట్టం 693.725 అడుగులు 2.212 టీఎంసీలలో ప్రాజెక్టు నీటి సామర్థ్యం కొనసాగుతుంది. కడెం ప్రాజెక్టు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రవాహ ప్రాంతాలకు ఎవరు కూడా వెళ్లకూడదని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రవీణ్ కుమార్ సూచించారు. కడెం ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలని అధికారులు కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు మత్తడి పారుతున్నాయి. ఆదిలాబాద్ సహా ఇంద్రవెల్లి, తలమడుగు మండలాల్లో భారీ వర్షం కురుస్తోంది. ఉట్నూరు, నార్నూరు, జైనూరు మండలాల్లో రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి నర్సాపూర్, శాంతాపూర్ వాగులు పొంగాయి. దీంతో ఆయా ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జయశంకర్ భూపాలపల్లి
జిల్లా మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ బ్యారేజ్‌కి వరద ప్రవాహం పోటెత్తుతుంది. గురువారం బ్యారేజ్ వద్ద 81,060 క్యూసెక్కుల వరద ప్రవాహం రాగా బ్యారేజ్‌లోని 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో వరదనీటిని భారీ నీటిపారుదల శాఖ అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా బ్యారేజీకి వరద ప్రవాహం మరింత పెరుగుతుందని, లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అవసరమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించారు.

# ఉత్తరాంధ్రకు మకుటాయమానం.. భోగాపురం విమానాశ్రయం



బోగాపురం: ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మార్చే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఈ ప్రాంత రాజకీయ, ఆర్థిక, పర్యాటక వృద్ధికి ప్రధాన చిరునామాగా మారనుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ఆగస్టు 1న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా జరగనున్న "అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం" ప్రారంభోత్సవ ఏర్పాట్లను బుధవారం ఆయన సహచర మంత్రులతో, ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎయిర్‌పోర్ట్ లోపల ఏర్పాటు చేసిన సాంస్కృతిక కట్టడాలు, కళాకృతులను మంత్రి దుర్గేష్ ఆసక్తిగా తిలకించగా సంబంధిత వివరాలను సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లిఖార్జున రావు వివరించారు. అనంతరం టెర్మినల్ భవనంలో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం ప్రస్ఫుటించేలా చేసిన ఏర్పాట్లను మంత్రి దుర్గేష్ కొనియాడారు.
ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..అభివృద్ధికి రెక్కలు వచ్చినట్లుగా, ఉత్తరాంధ్రకు గ్లోబల్ లుక్ వచ్చేలా దర్శనమిస్తున్న ఈ ఎయిర్‌పోర్ట్ ఆవరణలో ఏర్పాటు చేసిన బొబ్బిలి వీణలు, కూచిపూడి నృత్య భంగిమలు, ఏటికొప్పాక బొమ్మలు, తోలుబొమ్మలాట చిత్రాలు, కలంకారీ పెయింటింగ్స్ ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవానికి అద్దంపట్టేలా ఉంటూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని పేర్కొన్నారు. ప్రత్యేకించి శ్రీశైలం, తిరుమల, లేపాక్షి నంది వంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, మన్యం అందాలను చాటిచెప్పే డిజిటల్ స్క్రీన్‌లు, వాల్ పెయింటింగ్స్‌తో ఆంధ్రా వైభవం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునేలా ఉందని అభినందించారు.'ఫ్లైయింగ్ ఫిష్' ఆకారంలో రూపొందించిన టెర్మినల్ డిజైన్, విద్యుద్దీపాలంకరణతో అత్యంత సుందరంగా ఉందన్నారు. అంతేగాక ఎయిర్‌పోర్టులోని ఏరో బ్రిడ్జ్, ఏరో ట్రాఫిక్ కంట్రోల్ టవర్, రన్‌వే, టాక్సీవేలు, ఏప్రాన్ ప్రాంతాలు, అప్రోచ్ రోడ్లను మంత్రి దుర్గేష్ నిశితంగా పరిశీలించారు. హైస్పీడ్ సెక్యూరిటీ స్కానింగ్, ఫాస్ట్ డిజిటల్ చెక్-ఇన్, సెల్ఫ్ బ్యాగేజ్ డ్రాప్ ఇ-గేట్స్, విశాలమైన పార్కింగ్ స్థలాలు, ఎస్క లేటర్లు, ఎలివేటర్లు వంటి ఆధునిక వసతులు ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయి అనుభూతిని అందిస్తాయని తెలిపారు. ఎయిర్‌పోర్ట్ నమూనాను పరిశీలించి అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విశాఖ రైల్వే జోన్‌తో పాటు భోగాపురం ఎయిర్‌పోర్టు ద్వారా కేంద్ర సహకారంతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఉత్తరాంధ్ర అభివృద్ధికి పెద్దపీట వేసిందని మంత్రి తెలిపారు.

# ప్రతిపక్షంగా విఫలం అవుతున్న కాంగ్రెస్ !

ఈ దేశ దౌర్భాగ్యం ఏమంటే అసమర్థ కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండడం. అధికారంలో ఉంటే అవినీతికి పాల్పడడం, కుంభకోణాలను చేయడం, పాలనను గాలికి వదిలి వేయడం చూశాం. పదేళ్ల యూపిఎ పాలనలో మన్మోహన్ సింగ్‌ను ముందుకు పెట్టి ఎన్ని అరాచకాలు చేశారో చెప్పలేం. అలాగే ప్రతిపక్షంలో గత పదేళ్లుగా నిర్మాణాత్మక పాత్ర పోషించడంలోనూ విఫలం అవుతూ వస్తోంది. నిజానికి ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షానిదే బలమైన పాత్ర అని చెప్పాలి. దీనిని గుర్తించి నడచుకోవడంలో కూడా కాంగ్రెస్ పూర్తిగా విఫలం అయ్యింది. అధికార ఎన్‌డిఎ తప్పుడు పనులు చేస్తుంటే నిలదీయడం లేదు. ఆశ్రిత పక్షపాతం చూపితే నిలదీయడం లేదు. ప్రజల్లో చైతన్యం తెచ్చే కార్యక్రమాలు చేయడం లేదు. ఎందుకంటే ఆశ్రితపక్షపాతం, బంధుప్రీతి, కుటుంబ పాలన కాంగ్రెస్‌లో నరనరాన జీర్ణించుకుపోయింది. ఇంట్లో ఉన్న ముగ్గురు వ్యక్తులు పార్లమెంట్‌లోనే ఉన్నారు. కుటుంబ పాలనకు ఇదే నిదర్శనం. ఇకపోతే పార్లమెంట్ సమావేశాల్లో కూడా బలంగా ప్రజల వాణిని విన్పించడం లేదు. కాక్రోచ్ పార్టీకి వస్తున్న ఆదరణను తమ ఖాతాలో వేసుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. వారి ఉద్యమాన్ని హైజాక్ చేసి లబ్ది పొందే ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ క్రమంలో వారుచేస్తున్న ఆందోళనలు ఎబ్బెట్టుగా ఉన్నాయి. తాజాగా పార్లమెంట్ లోపలా బయటా విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశించారో చెప్పాలన్న డిమాండ్ చేస్తున్నారు. పార్లమెంట్ బయట ప్లకార్డులు పట్టుకుని ఆందోళనకు దిగారు. అందరూ గతంలో పాలన చేసిన వారే. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, తృణమూల్ అంతా పాలకులుగా ఉండివచ్చిన వారే. లాఠీ ఛార్జ్ చేయమని హోంమంత్రి ఆదేశిస్తారా అన్నది కూడా తెలియని వారు మన పాలనా వ్యవస్థలో ఉండడం దౌర్భాగ్యం. పోలీస్ మాన్యువల్ కూడా తెలియకుండా రాహుల్, ప్రియాంక, అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతున్నారు. లా అండ్ ఆర్డర్ కంట్రోల్ తప్పితే పోలీసులే నిర్ణయం తీసుకుని లాఠీఛార్జ్ చేస్తారు. నిషేధిత పార్లమెంట్ పరిసరాల్లో, ప్రధాని నివాసం వద్ద ఎలాంటి ఆందోళనలు జరిగినా తప్పకుండా కంట్రోల్ చేస్తారు. ఇదికూడా తెలియ నట్లుగా ప్లకార్డులు పట్టుకుని లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలిచ్చారో చెప్పాలని నినాదాలు చేయడం సిగ్గుచేటు. ఇది కేవలం రాజకీయంగా చేస్తున్న ఆందోళన తప్ప ఇందులో చిత్తశుద్ధి లేదని వారికి కూడా తెలుసు. అసలు కాంగ్రెస్ నిర్మాణాత్మకంగా వ్యవహరించి ఉంటే ఇవాళ విద్యార్థులు రోడ్డుకెక్కాల్సిన అవసరం వచ్చి ఉండేది కాదు. జూన్ 6న సీజేపీ ఏర్పడడంపై వచ్చిన ప్రతిస్పందన చూసిన తర్వాతగానీ కాంగ్రెస్ గళం విప్పలేదు. మే మొదటి వారంలో పేపర్ లీక్ జరిగి, మే 12న పరీక్ష రద్దయిన తర్వాత కాంగ్రెస్ తీవ్రంగా ప్రతిస్పందించి ప్రభుత్వాన్ని జవాబుదారీ చేసేందుకు చేయాల్సినన్ని ప్రయత్నాలు చేయలేదు. జూన్ 17న రాజస్థాన్‌లోని కోటాలో 'ఛాత్రోంకి గుంజ్' పేరిట విద్యార్థుల ర్యాలీని నిర్వహించిన రాహుల్‌గాంధీ ఆ తర్వాత 23 రోజుల పాటు అదృశ్యమై జర్మనీలో కాలక్షేపం చేశారు. సీజేపీ వ్యవస్థాపకుడు ఢిల్లీలో ప్రవేశించి తమ ఆందోళన తీవ్రతరం చేసిన తర్వాత, పార్లమెంటు సమావేశాలు మరో మూడు రోజుల్లో జరుగుతా యనగా రాహుల్‌లో కలవరం కలిగింది. అందుకే అమాంతంగా లేచి ప్రధాని నివాసం ముందు ధర్నాకు దిగారు. రాజకీయాల్లో నిరంతరత్వం, నిత్య క్రియాశీలత్వం లేకపోతే పరిస్థితి మరొకరి చేతుల్లోకి వెళుతుందన్న విషయం రుజువైంది.

# రాజధాని ఎక్కడో చెప్పకుండా పంపించేశారు

కర్నూలు: రాష్ట్ర విభజన సమయంలో రాజధాని ఎక్కడో చెప్పకుండా మనల్ని గెంటేశారని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఆ కసితోనే రాష్ట్రంలో అన్ని జిల్లాలను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. గురువారం కర్నూలులో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. ఏపీకి పరిశ్రమలు వస్తున్నాయని అంటే అందులో ఆ శాఖ మంత్రి టీజీ భరత్ కృషి ఎంతో ఉందని తెలిపారు. ఓ పట్టుదలతో తామంతా పనిచేస్తున్నామని అన్నారు. రిలయన్స్, ఫార్మాతోపాటు ఇతర పరిశ్రమలు కర్నూలు జిల్లాకు వస్తున్నాయని ఆయన వివరించారు. పట్టుదలతోపాటు క్రమశిక్షణతో పనిచేయాలని ఈ సందర్భంగా యువతకు మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ మూడు నెలల్లో (90 రోజుల్లో) వస్తుందని ప్రకటించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. గతంలో తాను చేపట్టిన యువగళం పాదయాత్రలో తనను పత్తికొండలో పోలీసుల ద్వారా అడ్డుకునే ప్రయత్నం చేశారని.. కానీ ప్రజలు, కార్యకర్తలు అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు.యువగళంలో ఇచ్చిన మాట ప్రకారం.. 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని భారీగా పరిశ్రమలు తీసుకొస్తున్నామని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సోలార్ ప్రాజెక్టులు వస్తుంటే రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని వైసీపీ నేతల తీరుపై మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యూనిట్‌పై రూ.13 పైసలు తగ్గించామన్నారు. విద్యుత్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్‌ను మొదటి స్థానంలో ఉంచాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని మంత్రి నారా లోకేశ్ చెప్పారు. ఇదిలావుంటే ఇచ్చిన మాట ప్రకారం ఆదోని చిన్నారుల కోరికను మంత్రి నారా లోకేశ్ నెరవేర్చారు. చిన్నారులు సహస్ర ఆద్య, జయ స్కందను కలిసిన మంత్రి వారితో ఫొటో దిగారు. దీంతో చిన్నారుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. 'లోకేశ్ సర్ మిమ్మల్ని కలవాలి, మీతో ఫొటో దిగాలని ఉంది' అంటూ ఆదోని చిన్నారుల వీడియో సోషల్ మీడియాలో తెగ హల్‌చల్ చేసింది. వెంటనే ఈ వీడియోపై స్పందించిన మంత్రి.. 'నేను కూడా మిమ్మల్ని కలవాలనుకుంటున్నాను' అంటూ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. అంతే కాకుండా చిన్నారుల వీడియోను రీ పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఆదోని పర్యటనలో ఉన్న మంత్రి లోకేశ్.. చెప్పిన మాట ప్రకారం చిన్నారులను కలిశారు. వారితో కలిసి ఫొటో దిగారు. దీంతో ఇద్దరు చిన్నారుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. తమ అభిమాన నాయకుడితో ఫొటో దిగడం పట్ల చిన్నారులు హర్షం వ్యక్తం చేశారు.

# వందేమాతరం గీతానికి పార్లమెంట్ ఆమోదం

**లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లు**

న్యూఢిల్లీ: వందేమాతరం గేయాన్ని అవమానించడం నేరంగా పరిగణించే బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. రాజ్యసభలో ఆమోదం పొందిన బిల్లుకు లోక్‌సభ కూడా తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో త్వరలో ఇది చట్ట రూపం దాల్చనుంది. ప్రతిపక్షాల నిరసనల నడుమ లోక్‌సభ నేడు మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం తెలిపింది. జాతీయ గేయాన్ని అవమానించడం నేరంగా పరిగణించేలా నేషనల్ ఆనర్ యాక్ట్-1971 చట్టంలో మార్పుల కోసం కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చిన విషయం తెలిసిందే. రాజ్యాంగం, జాతీయ జెండా, జాతీయ గీతాన్ని అవమానించిన వారికి ప్రస్తుతం గరిష్ఠంగా మూడేళ్ల వరకూ జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది. ఇకపై జాతీయ గేయాన్ని అవమానించిన వారికి కూడా ఇదే శిక్ష పడేలా చట్టంలో మార్పులు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపిన ఈ గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తైన నేపథ్యంలో కేంద్రం ఈ గేయానికి మరిన్ని రక్షణలు కల్పిస్తూ తాజా బిల్లును తీసుకొచ్చింది. బంకిమ్ చంద్ర ఛటర్జీ 1875లో ఈ గేయాన్ని రచించారు. ఆనంద్‌మఠ్ నవలలో భాగంగా తొలిసారి 1882లో ఈ గేయం ప్రచురితమైంది. ఇక ప్రభుత్వ కార్యక్రమాల్లో జాతీయ గేయం ఆలాపనకు సంబంధించి కేంద్రం ఇటీవల రాష్ట్రాలకు నూతన మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. రాజ్యసభలో ఈ బిల్లును జులై 24న ప్రవేశపెట్టగా జులై 29న ఆమోదం లభించింది. నేడు లోక్‌సభ కూడా బిల్లుకు ఆమోదం తెలిపింది. నీట్ పేపర్ లీక్ వ్యతిరేకంగా ప్రతిపక్షాల నిరసనల నడుమ రెండు సభల్లోనూ బిల్లుకు ఆమోదం లభించింది.

# మోడీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలి

పుణె: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన పదవికి రాజీనామా చేసి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎద్దేవా చేశారు. దేశాన్ని పాలించడం కంటే ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మోదీ బాగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని పదవికి రాజీనామా చేసి దేశాన్ని నడిపే బాధ్యతను మరో నాయకుడికి అప్పగించాలన్నారు. ఢిల్లీలో నిరసనలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత తొలిసారి తన స్వస్థలమైన మహారాష్ట్రకు అభిజీత్ చేరుకున్నారు. ఈ సందర్భంగా అభిజీత్ దీప్కే మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీలో ఆందోళనలను విరమించిన తర్వాత వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి నిరసనకారులను గుర్తించి వేధిస్తున్నాయని ఆరోపించారు. ఆయా ప్రభుత్వాలు వెంటనే ఈ వేధింపులను ఆపాలని, లేకపోతే రానున్న ఎన్నికల్లో విద్యార్థులు, యువత తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థుల్లో ఉన్న ఆగ్రహం ఏమాత్రం తగ్గలేదన్నారు. యువత ఆగ్రహం ఒక్క మంత్రిపై కాదని, కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. యువతలో ఉన్న అసంతృప్తిని బీజేపీ ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతోందని అభిజీత్ విమర్శించారు. ఇలాగే విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటే ఉద్యమం మరింత ఉధృతమవుతుందని అభిజీత్ హెచ్చరించారు. వీరు ఉగ్రవాదులు కాదని, దేశ భవిష్యత్తని ఆయన పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును ఇలాంటి పరిస్థితులకు గురి చేస్తే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్లే అవసరమైతే ప్రభుత్వాన్నీ మార్చే ఉద్యమం చేపడతామని తేల్చిచెప్పారు. ఈసారి ఆందోళన మరింత భారీస్థాయిలో ఉంటుందని హెచ్చరించారు. ఢిల్లీ జంతర్‌మంతర్‌లో సీజేపీ నిరసన సందర్భంగా విద్యార్థులపై పె÷-లలెట్ గన్ వినియోగించిన ఘటనపైనా అభిజీత్ స్పందించారు. అమిత్ షా అయినా, మరెవరైనా సరే పెల్లెట్ గన్ కాల్పులకు ఆదేశాలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం సీజేపీ కార్యకర్తలు సంబరాలు చేసుకోవడంపై వచ్చిన విమర్శలను సీజేపీ వ్యవస్థాపకుడు తిప్పికొట్టారు. కార్యకర్తలు 36 రోజుల పాటు ఎండ, వర్షాన్ని లెక్కచేయకుండా కష్టపడి పోరాడారని, అలాంటి విజయం తర్వాత సంబరాలు చేసుకోవడంలో
తప్పేముందని ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత బీజేపీ కూడా సంబరాలు చేసుకుంటుందని గుర్తు చేశారు. తమ కార్యకర్తలు బీజేపీ మాదిరిగా రహదారులను దిగ్బంధం చేయలేదన్నారు. ఈ సందర్భంగా రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌ను పార్లమెంట్‌లో బీజేపీ సన్మానించడం సిగ్గుచేటని విమర్శించారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న తర్వాత ఆయనను సన్మానించడం ద్వారా బీజేపీ ఏ సందేశం ఇవ్వాలనుకుంటోందని ప్రశ్నించారు. పేపర్ లీక్ కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వం చెప్పే మాటలకు, చేతలకు పొంతన లేదని అభిజీత్ ఆరోపించారు. ప్రధాని మోదీ మూడు రోజుల క్రితం పేపర్ లీక్ కేసుల కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించారని, అయితే తొలి విచారణకే సీబీఐ తరఫు న్యాయవాది హాజరుకాకపోవడంతో కేసు వాయిదా పడిందని విమర్శించారు. బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన విమర్శలపైనా అభిజీత్ దీప్కే స్పందించారు.

భారత్ ప్రతినిధి
తెలుగు దిన పత్రిక

# గుంటూరు వార్తలు

శుక్రవారం, 31 జూలై 2026

# మహిళా ఎస్సై పై వైసీపీ నేతల దాడి హేయం

## బాధ్యులను కఠినంగా శిక్షించాలి : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, 30 జూలై 2026, భారత్ ప్రతినిధి :** విధి నిర్వహణలో ఉన్న మహిళా ఎస్సై ప్రవల్లికపై వైసీపీ నాయకులు చేసిన దాడి, అనుచిత ప్రవర్తనను టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తీవ్రంగా ఖండించారు. చట్టాన్ని అమలు చేసే పోలీసు అధికారిపైనే చేతులు వేసి ఇబ్బందులకు గురిచేయడం అత్యంత హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళా ఎస్సైపై జరిగిన దాడి కేవలం ఒక పోలీసు అధికారిపైనే కాకుండా చట్టవ్యవస్థపై జరిగిన దాడిగా పరిగణించాలన్నారు. విధుల్లో ఉన్న మహిళా అధికారి పై వైసీపీ నేతలు వ్యవహరించిన తీరు పూర్తిగా అనుచితమైందని, మహిళల పట్ల వారి వైఖరిని బయటపెడుతోందని విమర్శించారు. మహిళల గౌరవం, భద్రత గురించి మాట్లాడే వైసీపీ నాయకత్వం ఈ ఘటనపై సమాధానం చెప్పాలని గళ్ళా మాధవి డిమాండ్ చేశారు. మహిళా ఎస్సైపై చేతులు వేసి, విధులకు ఆటంకం కలిగించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తాయని అన్నారు. జగన్ రెడ్డి ఈ ఘటనలో మృతి చెందిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించి వారికి అండగా నిలవాల్సిన జగన్ మోహన్ రెడ్డి, నేరారోపణలు ఎదుర్కొంటున్న వారిని పరామర్శించడం విచారకరమని ఎమ్మెల్యే విమర్శించారు. చట్టం ముందు అందరూ సమానమేనని, రాజకీయ ప్రభావంతో ఎవరూ తప్పించుకోలేరని స్పష్టం చేశారు. మహిళల భద్రత, గౌరవం విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, చట్టాన్ని ఉల్లంఘించిన వారి పై నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకోవాల్సిందేనని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

# ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ రూ.25 లక్షల విరాళం

## చెక్కును ఆలయ ఈవో వై నరేష్ రెడ్డి, ట్రస్ట్ బోర్డు చైర్మన్ వేదాంతం శ్రీనివాస శర్మకు అందజేసిన ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, 30 జూలై 2026, భారత్ ప్రతినిధి :** గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం స్థానిక రైలుపేటలోని శ్రీఅంజనేయస్వామి దేవస్థానం పునరుద్ధరణ నిమిత్తం దాతలు అందజేసిన రూ.25 లక్షల చెక్కును ఆలయ ఈవో వై నరేష్ రెడ్డి, ట్రస్ట్ బోర్డు చైర్మన్ వేదాంతం శ్రీనివాస శర్మకు ఎమ్మెల్యే నసీర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో అన్ని ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ప్రతి ఆలయానికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామని, కొన్ని పునర్నిస్తున్నామని చెప్పారు. ఆలయాల అభివృద్ధిలో దాతల భాగస్వామ్యం అభినందనీయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల సమగ్ర అభివృద్ధి, ధార్మిక పరిరక్షణ, భక్తులకు మౌలిక వసతుల కల్పన దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 360కి పైగా ఆలయాల పునర్నిర్మాణం, ధూపదీప నైవేద్యాలు, ఇతర మౌలిక వసతుల కల్పన కోసం రూ.500 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించిందన్నారు.

# బండి సాహితీ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం : వాసిరెడ్డి విద్యాసాగర్



**గుంటూరు, 30 జూలై 2026, భారత్ ప్రతినిధి :** దివంగత కుమార్తె సాహితీ రెడ్డి గత 8 సంవత్సరాలుగా విద్య సామాజిక సేవలకు భూరి విరాళాలు అందిస్తూ దాతృత్వాన్ని చాటుకుంటూ స్ఫూర్తిదాయకంగా ఉన్న బండి సాహితీ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు అశోక్ రెడ్డి సుధావాణి దంపతుల సామాజిక సేవలు పలువురికి స్ఫూర్తిదాయకమని విబిఐటి విశ్వవిద్యాలయం ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ పేర్కొన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం పద్మావతి కళ్యాణ మండపంపై బండి సాహితీ రెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పురస్కారాలు ప్రధానోత్సవ సభ నిర్వహించారు.

**అతిథిగా పాల్గొన్న సాయి భాస్కర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ,** ఏకైక కుమార్తె జ్ఞాపకార్థం పేద విద్యార్థులకు ఇతర సామాజిక కార్యక్రమాలకు రూ.8 కోట్లకు పైగా సేవా కార్యక్రమాలకు అందించటం మిత్రుడిగా గర్విస్తున్నానన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన అనంతరం సాహితీరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సాహితి సుగంధం ఆవిష్కరణ ఆవిష్కరించారు. బండి సాహితీ రెడ్డి వరిష్ట పురస్కారాన్ని ప్రముఖ సినీ, రంగస్థల నటులు తనికెళ్ళ భరణికి, యువ ప్రతిభా పురస్కారాన్ని కాకతీయ చరిత్ర పరిశోధకుడు అరవింద ఆర్యపకిడే కు అందజేశారు. 50 మంది విద్యార్థులకు 10 వేల రూపాయలు చొప్పున 5 లక్షల రూపాయలు పారితోషకం అందజేశారు. సభకు డాక్టర్ మోదుగుల రవికృష్ణ అధ్యక్షత వహించగా జ్యోతి ప్రజ్వలన దేవాలయం అధ్యక్షులు చిట్టిపోతు మస్తానయ్య గావించారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిథి డాక్టర్ గుమ్మా సాంబశివరావు, దేవాలయం కార్యదర్శి బొమ్ము ఉమామహేశ్వరరావు, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి. లక్ష్మణ్ రెడ్డి, గాయత్రి సన్మండలి శేషురాణి, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# "డ్రగ్స్ వద్దు బిడ్డ" థియేట్రికల్ యాడ్ ఫిల్మ్‌కు క్లాప్ కొట్టిన జిల్లా ఎస్పీ



**గుంటూరు, 30 జూలై 2026, భారత్ ప్రతినిధి :** యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా చైతన్యపరిచే లక్ష్యంతో రూపొందిస్తున్న "డ్రగ్స్ వద్దు బిడ్డ" థియేట్రికల్ యాడ్ ఫిల్మ్ చిత్రీకరణను గురువారం తెనాలిగాంధీచౌక్ కూడలిలో ఘనంగా ప్రారంభించారు. సినీ దర్శకుడు దిలీప్ రాజా దర్శకత్వంలో రూపొందుతు న్న ఈ సందేశాత్మక లఘు చిత్రానికి జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ క్లాప్‌కొట్టి చిత్రీ కరణ ను ప్రారంభించగా, రాష్ట్ర మహిళా కమి షన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ కెమెరా స్విచ్ ఆన్ చేసి తొలి సన్నివేశాన్ని ప్రారంభించారు. సీనియర్ సినీనటుడు నరసింహరాజు పాల్గొన్న సన్నివేశంతో చిత్రీకరణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లాఎస్పీ మాట్లాడుతూ, రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత సమాజంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం, పోలీసు శాఖ సమన్వయంతో విస్తృత చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయం, కొనుగోలు, వినియోగం, నిల్వ, రవాణా, సరఫరా వంటి నేరాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గత ఎనిమిది నెలల్లో డ్రగ్స్ సంబంధిత కార్యకలాపాల్లో పాల్గొన్న సుమారు 450 మంది పై చట్టపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న "సంకల్పం" కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు సుమారు 75వేల మంది స్టూడెంట్స్ కి డ్రగ్స్ దుష్పరిణామాలపై అవగాహన కల్పించినట్లు వెల్లడించారు.డ్రగ్స్ యువత భవిష్యత్తుతో పాటు కుటుంబాలు, సమాజాన్నీ తీవ్రంగా ప్రభావితం చేస్తాయని పేర్కొన్న ఎస్పీ, ఇప్పటికే పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇప్పుడు థియేట్రికల్ యాడ్ ఫిల్మ్ ద్వారా మరింత విస్తృతంగా ప్రజలకు ఈ సందేశాన్ని చేరవేస్తున్నామని తెలిపారు. సామాజిక బాధ్యతతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించి, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెనాలి ఆర్డీఓ శ్రీరమణి, సహాయ కమిషనర్ రామారావు, తెనాలి సీఐలు సీహెచ్. రాంబాబు, డి. రవీంద్రబాబు, ఎస్. సాంబశివరావు, షేక్ నాయబ్ రసూల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# సీ.జీ.హెచ్.ఎస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ల కు అభినందన





**గుంటూరు, 30 జూలై 2026, భారత్ ప్రతినిధి :** సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీ.జీ.హెచ్.ఎస్) గుంటూరు వెల్నెస్ సెంటర్ లో సీనియర్ మెడికల్ ఆఫీసర్లు గా సేవలందిస్తున్న డాక్టర్ కొండా నాగార్జున, డాక్టర్ దాసరి రమేష్ లు, చీఫ్ మెడికల్ ఆఫీసర్లు (సీ.ఎం.ఓ)గా పదోన్నతి పొందిన సందర్భంగా గుంటూరు సీ.జీ.హెచ్.ఎస్ లో పని చేసిన రిటైర్డ్ అధికారి, పూర్వపు సీ.ఎం.ఓ డాక్టర్ టి.సీహెచ్. కోటేశ్వరరావు గురువారం నగరంపాలెంలోని సీ.జీ.హెచ్.ఎస్ కార్యాలయంలో ఇరువురు డాక్టర్లను అభినందించి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోటేశ్వర రావు మాట్లాడుతూ..ఏ వెల్నెస్ సెంటర్‌లో లేని విధంగా, గుంటూరులో ఇద్దరు సీ.ఎం.ఓలు పని చేయడం అరుదైన విషయమని, ఇద్దరు డాక్టర్లు కలిసి గుంటూరు సీ.జీ.హెచ్.ఎస్ ను సేవలలో మేటిగా నిలపాలని కోరారు. ఉద్యోగులు, పెన్షనర్లకు సీ.జీ.హెచ్.ఎస్ పై నమ్మకాన్ని మరింత పెంచేలా సేవలందించాలన్నారు. ఎంపానల్డ్ ఆసుపత్రులతో మాట్లాడి, ప్రతి పేషంట్‌కు ఆరోగ్య సంరక్షణ అందేలా కృషిచేయాలని ఆయన సూచించారు.

**డాక్టర్ కొండా నాగార్జున, డాక్టర్ దాసరి రమేష్ లు మాట్లాడుతూ** గుంటూరు సీ.జీ.హెచ్.ఎస్ కు ప్రతి రోజు అధిక సంఖ్యలో లబ్దిదారులు వస్తున్నప్పటికీ, ఓర్పు, సహనంతో రోగులకు సేవలంది స్తున్నట్లు చెప్పారు. రిటైర్డ్ డాక్టర్ల సలహాలు, సూచనలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లోకల్ ఎడ్వైజరీ కమిటీ మెంబర్లు కట్టా వెంకటేశ్వర్లు, గుమ్మడి సీతారామయ్యచౌదరి, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ హేమ సుందరి ఫార్మాసిస్టులు లక్ష్మీ కౌసల్య, సునీల్ వైద్య సిబ్బంది పేరేశ్వరరావు, మురళీ, రామారావు పాల్గొన్నారు.

# ఆగస్టు 13వ తేదీన స్టీల్ బ్రిడ్జి మరియు సీడ్ యాక్సెస్ రోడ్ ప్రారంభం

## జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ



**గుంటూరు, 30 జూలై 2026, భారత్ ప్రతినిధి :** స్టీల్ బ్రిడ్జి, సీడ్ యాక్సెస్ రోడ్ ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఆగస్టు 13వ తేదీన జరగనున్నాయని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు. వివిధ అంశాలపై జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, స్టీల్ బ్రిడ్జి, సీడ్ యాక్సెస్ రోడ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరు కానున్నారని చెప్పారు. ఈ కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేయుటకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్ర స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు పక్కాగా చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, రెవిన్యూ అధికారి ఖాజావలి, అధికారులు పాల్గొన్నారు.




# మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పోస్టర్ విడుదల చేసిన కలెక్టర్

**గుంటూరు, 30 జూలై 2026, భారత్ ప్రతినిధి :** ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం (వరల్డ్ డే ఎగైనెస్ట్ హ్యూమన్ ట్రాఫికింగ్) సందర్భంగా పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ పోస్టర్ ను షాడోస్ మరియు వెట్టిచాకిరి విమోచన కోయిలేషన్ సంస్థ తయారు చేసింది. మానవ అక్రమ రవాణా నిరోధక అవగాహన కార్యక్రమం ఎంతో అవసరం అన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాలు కొనసాగించాలనికోరారు. ఈకార్యక్రమంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎ. గాయత్రి దేవి, షాడోస్ మరియు వెట్టి చాకిరి విమోచన కోయిలేషన్ సంస్థ ప్రతినిధులు ఏ. రాజ సాల్మన్, భాగ్యలక్ష్మి, అలేఖ్య, పావని, డిబిఆర్సి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏ.ఎన్.యు ప్రొఫెసర్ హరిబాబుకు బ్రిటన్ ఆర్.ఎస్.ఎస్.సి ఫెలోషిప్




**గుంటూరు, 30 జూలై 2026, భారత్ ప్రతినిధి :** ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ హరిబాబు బ్రిటన్ కు చెందిన ప్రతిష్ఠాత్మక 'రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ' (ఆర్‌ఎస్సి) ఫెలో (ఎఫ్.ఆర్.ఎస్.సి)గా ఎన్నికయ్యారు. రసాయన శాస్త్ర రంగంలో ఆయన చేసిన విశేష పరిశోధనలు, బోధనా ప్రతిభ, శాస్త్రీయ నాయకత్వం, సమాజానికి అందించిన సేవలను గుర్తించి ఈ అరుదైన గౌరవాన్ని ప్రదానం చేశారు. ఇకపై ఆయనతనపేరుకు ముందు లేదావెనక "ఎఫ్.ఆర్.ఎస్.సి" హోదాను ఆర్‌ఎస్‌ఎస్సి అధికారికంగా వెల్లడించింది.

# గుంటూరు జిల్లాలో ఐహీూజ రెండో సబ్ కమిటీ సమావేశం విజయవంతం



**గుంటూరు, 30 జూలై 2026, భారత్ ప్రతినిధి :** గుంటూరు జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ (డిఎంఎసి) చైర్మన్, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రెండో సబ్ కమిటీ సమావేశం గురువారం విజయవంతంగా నిర్వహించారు. ఈ సమావేశంలో మీడియా ప్రతినిధుల అక్రిడిటేషన్ దరఖాస్తులను సబ్ కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించారు. అర్హత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న దరఖాస్తులను ఆమోదిస్తూ, అర్హులైన ప్రతి మీడియా ప్రతినిధికి మీడియా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని నిర్ణయించారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పాత్రికేయులకు పారదర్శకంగా, నిష్పాక్షికంగా అక్రిడిటేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నట్లు సమావేశంలో పేర్కొన్నారు. మీడియా ప్రతినిధుల సంక్షేమం, వారికి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు సక్రమంగా అందేలా డిఎంఎసి కమిటీ కట్టుబడి పనిచేస్తుంది. ఈ సమావేశంలో డిఎంఎసి సబ్‌కమిటీ సభ్యులు, సమాచార & పౌర సంబంధాల శాఖ (ఐ&పిఆర్) అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నల్లపాడులో విద్యార్థినులకు మహిళా భద్రతపై అవగాహన



**గుంటూరు, 30 జూలై 2026, భారత్ ప్రతినిధి :** నల్లపాడులోని కళాశాలలో విద్యార్థినులకు మహిళా భద్రత, చట్టాలపై పోలీసులు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళల రక్షణ చట్టాలు,ఈవ్ టీగింగ్, సైబర్ నేరాల నుంచి రక్షణ, గుడ్ టచ్-బ్యాడ్ టచ్ అంశాలపై వివరించారు. అత్య వసర పరిస్థితుల్లో 112,100కు కాల్ చేయా లని, శక్తి యాప్ను వినియోగించాలని సూచించారు. వేధిం పులు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు నల్లపాడు ఎస్సై మధు పవన్ మరియు పోలీస్ సిబ్బంది విద్యార్థినులు పాల్గొన్నారు.

# 22-ఏ నిషేధిత భూముల సవరణకు అవకాశం : ఆర్డీఓ మల్లిబాబు



**కాకినాడ బ్యూరో, 30 జూలై 2026, భారత్ ప్రతినిధి :** 22-ఏ. నిషేధిత జాబితాలో పొరపాటున చేర్చబడినట్లు భావించే భూయజమానులు ప్రైవేట్ పట్టా భూములను సవరించుకునేందుకు బాధితులు తమ పరిధిలోని తహశీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కాకినాడ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్ మల్లిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రెవెన్యూ (రిజిస్ట్రేషన్) శాఖ జారీ చేసిన జి.వో ఎమ్.ఎస్.నెంబర్ 444 (తేదీ: 27.07.2026) ప్రకారం 22-ఎ. భూముల పరిష్కారానికి ప్రభుత్వం సమగ్ర మార్గదర్శకాలను విడుదల చేసిందని, కావున ప్రైవేట్ పట్టా భూములు పొరపాటున ఈ జాబితాలో చేర్చబడినట్లు భావించే భూ యజమానులు తమ పట్టాదారు పాస్‌బుక్, రిజిస్టర్డ్ దస్తావేజులు, రెవెన్యూ రికార్డులు, కోర్టు ఉత్తర్వులు (ఉన్నట్లయితే), తాజా ఎన్‌కంబ్రెన్స్ సర్టిఫికేట్ మరియు ఇతర ఆధార పత్రాలతో సంబంధిత తహశీల్దారు వారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమర్పించిన దరఖాస్తులను అధికారులు జీవో నెం.444 మరియు ప్రభుత్వ నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి అర్హత ఉన్న కేసుల్లో తదుపరి చర్యలు చేపడతారని, ప్రైవేట్ పట్టా భూయజమానులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో మల్లిబాబు కోరారు.

## షర్మిల ఆరోగ్యంపై గుంటూరులో ప్రత్యేక ప్రార్థనలు



**గుంటూరు, 30 జూలై 2026, భారత్ప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని గుంటూరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏపీసీసీ మైనారిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క చంద్రపాల్ ఆధ్వర్యంలో గుంటూరులోని పునీత అంతోని వారి పుణ్యక్షేత్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు యన్నం సుధీర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తైన వైఎస్ షర్మిల త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని ప్రజాసేవలో తిరిగి చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్య క్రమంలో గుంటూరు నగరకాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఖలీల్, మల్లెల మోషే, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్య కర్తలు పాల్గొని వైఎస్ షర్మిల త్వరగా కోలుకోవాలని ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు.

## సత్తెనపల్లి లోని శ్రీ వైష్ణవి విద్యాసంస్థల్లో న్యాయ అవగాహన కార్యక్రమం



**సత్తెనపల్లి, 30 జూలై 2026, భారత్ ప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు, సత్తెనపల్లి న్యాయ సేవాధికార మండల కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వి. విజయ్ కుమార్ రెడ్డి గారి సూచనలతో పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని శ్రీ వైష్ణవి విద్యాసంస్థలు - ప్రగతి జూనియర్ & డిగ్రీ కళాశాలలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా న్యాయఅవగాహనకార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్యానెల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణా సమాజానికి పెను ముప్పుగా మారిందన్నారు.కొందరు ముఠాలుగా ఏర్పడి మహిళలు, చిన్నారులు, నిరుపేదలను మోసం చేసి అక్రమ రవాణాకు పాల్పడటమే కాకుండా, వారిని బలవంతంగా భిక్షాటన చేయిస్తూ అక్రమంగా లాభాలు పొందుతున్నారని వివరించారు. ఇలాంటి నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద సంఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

**కళాశాల డైరెక్టర్ బ్రహ్మారెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ,** విద్యార్థుల భవిష్యత్తు ఎంతో విలు వైనదని, విదేశాల్లో ఉద్యోగాలు, అధిక వేతనాలు, సినిమా, సెలెబ్రేటీ, స్పోర్ట్స్ అవకాశాలు, ఇప్పిస్తామంటూ, ప్రముఖులుగా తీర్చి దిద్దుతామని వచ్చే మోసపూరిత ప్రకటనలను నమ్మి మోస పోవద్దని హెచ్చరించారు. ఉద్యోగాలు, విద్యాఅవకాశాల పేరుతో వచ్చేప్రతి సమాచారాన్ని అధికారికంగా ధ్రువీకరించుకుని మాత్రమే నిర్ణయాలు తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాదులు కోటగిరి లక్ష్మణ్, గుర్రం పవన్, తెనాలి నవజ్యోతి బాబు, కళాశాల డైరెక్టర్ బ్రహ్మారెడ్డి, పారా లీగల్ వాలంటీర్లు షేక్ సుభాని, అట్లూరి జ్యోతి, అధ్యాపకులు మరియు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే నివాసంలో టీడీపీ నేతల ఆత్మీయ విందు

పార్టీ బలోపేతం, అభివృద్ధి కార్యక్రమాలపై కీలక చర్చలు

హాజరైన జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ చార్జీలు



**కాకినాడ బ్యూరో, 30 జూలై 2026, భారత్ ప్రతినిధి :** కాకినాడ రూరల్ పరిధిలోని వలసపాకలలో ఉన్న మాజీ శాసనసభ్యులు పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి నివాసంలో జిల్లా పార్టీ నేతల ఆత్మీయ విందు కార్యక్రమం జరిగింది. టీడీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌ల సమన్వయంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ?ఈ సమ్మేళనం కేవలం విందుకే పరిమితం కాకుండా పార్టీ భవిష్యత్ కార్యాచరణకు వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా నాయకులంతా ఒకచోట చేరి జిల్లాలో పార్టీ బలోపేతంపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా గత రెండేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లడం, భవిష్యత్తులో చేపట్టాల్సినపనులు తదితరకీలకఅంశాలపై నేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. నాయకుల మధ్య సమన్వయం పెంచేందుకు రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ఇటువంటి ఆత్మీయ సమావేశాలు మరిన్ని నిర్వహి స్తామని పార్టీ జిల్లా అధ్యక్షులు నవీన్ సహా ఇతర నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ ఆత్మీయవిందు కార్యక్రమంలో టీడీపీపొలిట్ బ్యూరో సభ్యులు, జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరపుల సత్యప్రభ, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, కర్రి పద్మశ్రీ, కాకినాడ రూరల్ ఇన్‌ఛార్జ్ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో విజయవంతంగా లాపరోస్కోపిక్ ఆపరేషన్



**జగ్గంపేట, 30 జూలై 2026, భారత్ ప్రతినిధి :** జూలై 29వ తేదీన కడుపు నొప్పి వస్తుంది అని భూపాలపట్నం కి చెందిన 19 సంవత్సరాలు వయసు గల ఒక యువతి జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కి వచ్చింది. అయితే స్కానింగ్ ద్వారా అది 24 గంటల నొప్పిగా గుర్తించారు. కాకినాడ పెద్ద ఆసుపత్రి లేదా రాజమండ్రి పెద్ద ఆసుపత్రిలో తప్ప వేరే ఎక్కడ అందుబాటులో లేని సుమారు నలభై లక్షల విలువగల అత్యాధునిక లాప్రోస్కోపిక్ పరికరాన్ని జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కమిటీ చైర్మన్ మరియు జగ్గంపేట శాసనసభ్యులు అయిన శ్రీ జ్యోతుల నెహ్రూ గారు జిల్లా అధికారి డి.సి.హెచ్..ఎస్ మహేష్ గారిని సంప్రదించి లాప్రోస్కోపిక్ పరికరాన్ని జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కి వచ్చేలా చేశారు. అయితే ఆ పరికరాన్ని ఉపయోగించి గురువారం అనగా జూలై 30వ తేదీన జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ మరియు జనరల్ సర్జన్ డాక్టర్ టి. ప్రణీత్ మరియు మత్తు డాక్టర్ పి. వినుషా కలిసి 24 గంటల అత్యవసర సర్జరీని విజయవంతంగా ఆపరేషన్ పూర్తి చేసారు. బయట హాస్పిటల్ లో సుమారు 40000 ఖర్చు అయ్యే ఆపరేషన్ ని జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో ఉచితంగా చేసి యువతి ప్రాణాలు కాపాడినందుకు యువతి మరియు యువతి కుటుంబ సభ్యులు ఆపరేషన్ చేసిన డాక్టర్ కి మరియు ఆసుపత్రి సిబ్బంది కి కృతజ్ఞతలు తెలిపారు.

# రెవెన్యూ యంత్రాంగం ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా పనిచేయాలి

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేశీధిర ప్రసాద్



**కాకినాడ బ్యూరో, 30 జూలై 2026, భారత్ ప్రతినిధి :** రీ-సర్వే మరియు భూ రికార్డుల స్వచీకరణ, నిర్వహణ వంటి ప్రధాన ప్రభుత్వ లక్ష్యాల సాధన లో రెవెన్యూ యంత్రాంగం కీలక పాత్ర పోషించి, ప్రజలనమ్మకాన్ని నిలబెట్టే విధంగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేశీధిర ప్రసాద్ స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అంశాలపై ఆర్‌డిఓ లు, తహశీల్దార్ల తో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రీ-సర్వే 4,5 దశల్లో గ్రౌండ్ ట్రూతీశిగ్, 13 నోటిఫికేషన్, ఈ-కేవైసీ, పట్టాదారు పాస్ పుస్తకాల ముద్రణ, జాయింట్ ఎల్‌పీఎం కేసుల పరిష్కారం, రెవెన్యూ రికార్డుల స్వచ్ఛకరణ, వెబ్ ల్యాండ్ డేటా అప్‌డేట్, పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ తదితర అంశాల పురోగతిని ఈ సందర్భంగా కలెక్టర్ సమీక్షించారు.

**జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ** జిల్లా పరిపాలన లో రెవెన్యూ శాఖ ముందుండి నడవాలని,ప్రభుత్వ పని తీరు పట్ల విశ్వసనీయత పెరుగుదలకు అధికారులు బలమైన పునాది కావాలన్నారు.ప్రతి మంగళ వారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మరియు భూ పరిపాలన ముఖ్య కార్యదర్శులు రెవెన్యూ అంశాలు, రీ-సర్వేపై సమీక్ష నిర్వహిస్తున్నందున, ప్రతి రెవెన్యూ అధికారి నిర్దేశిత లక్ష్యాలను నిర్దేశిత కాల పరిమితి లోగా సాధించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుదనం, సమయ పాలన మరియు క్షేత్ర స్థాయి ధృవీకరణ తప్పనిసరిగా ఉండాలని తేల్చి చెప్పారు. జిల్లా లో రెవెన్యూ పరిపాలనను మరింత పారదర్శకంగా, వేగవంతంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో చేపట్ట నున్న పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్య క్రమానికి ఇప్పటి నుండే సర్వే ప్రక్రియ పూర్తి చేసి, పుస్తకాల ముద్రణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి గౌ. ముఖ్యమంత్రి వర్యులు విచ్చేసే అవకాశం ఉందని, అదేవిధంగా ముఖ్య మంత్రి పర్యటన లో భాగంగా తాహశీల్దార్ కార్యాలయాల సందర్శన కూడా ఉండే అవ కాశం ఉన్నందున తహ శీల్దార్లు పూర్తి సన్నద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు అర్హులందరికీ చేరేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పరిపాలనలో బాధ్యతాయుత ధోరణి, మెరుగైన సుపరిపాలన అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా అభివృద్ధి, పరిపాలనా సామర్థ్యం మరియు సేవల నాణ్యత పెంపు లక్ష్యాల సాధనలో ప్రతి రెవెన్యూ అధికారి ఫలితాల ఆధారిత పనితీరు కనబరచాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, ఆర్డీవోలు ఎస్. మల్లి బాబు, పి. కృష్ణ మూర్తి, అలాగే వివిధ మండలాల తహశీల్దార్లు మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్డీయే రెండేళ్ల విజయాలను ఇంటింటికీ తీసుకెళ్లండి : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, 30 జూలై 2026, భారత్ ప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేసే బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. గురువారం పార్టీ నేతలతో సమావేశం నిర్వహించి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో నిర్వహిస్తున్న '2 ఏళ్ల అభివృద్ధి-సంక్షేమం' ఇంటింటిప్రచార కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కుటుంబసాధికార సమితి సభ్యుల నుంచి పార్టీ అన్ని స్థాయిల నాయకుల వరకు ప్రతి ఒక్కరూ ప్రజల వద్దకు వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని సూచించారు. రాష్ట్ర పునర్నిర్మాణ దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకుంటున్న చర్యలను ప్రజలకు తెలియజేయా లన్నారు. ప్రభుత్వంపై వైసీపీ నేతలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజల్లోనే తిప్పికొ ట్టాలని, వాస్తవాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. గతంలో రాష్ట్రాన్ని అరాచక పాలనతో వెనక్కి నెట్టిన వైసీపీ నేతలు ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆమె విమ ర్శించారు. పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్త కష్టాన్ని చంద్రబాబు నాయుడు గుర్తి స్తున్నారని, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియో గించి అసెంబ్లీ కమిటీ, క్లస్టర్ స్థాయి నుంచి సాధారణ కార్యకర్త వరకు అందరి పనితీరును మై టీడీపీ యాప్ ద్వారా పనితీరును గుర్తిస్తున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. కష్టపడి పనిచేసే వారికి పొలిట్‌బ్యూరో వంటి అత్యున్నత బాధ్యతలు కూడా దక్కే అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. అరాచకవాదులకు మద్దతుగా నిలుస్తున్న వైసీపీ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని, పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూవారి సమస్యల పరిష్కా రానికి కృషి చేయాలని, ప్రభుత్వ విజయాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.

# హెల్మెట్ ధరించండి ప్రాణాలను కాపాడుకోండి




ట్రాఫిక్ ఆర్ఐ కృష్ణ ఆధ్వర్యంలో వాహనదారులకు అవగాహన కార్యక్రమం

**ఎన్.టి.ఆర్ జిల్లా (ఇబ్రహీంపట్నం), 30 జూలై 2026, భారత్ ప్రతినిధి :** హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని,హెల్మెట్ పెడితే పెట్టుకోవడంతో పాటు క్లిప్ కూడా పెట్టుకోవాలని వాహనదారులకు ట్రాఫిక్ ఆర్ ఐ కృష్ణ సూచించారు. ఇబ్రహీంపట్నం లోని రింగ్ సెంటర్ వద్ద వాహనదారులకు హెల్మెట్ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ మాత్రమే ధరించడం కాకుండా, దానికి ఉన్న క్లిప్ ను కూడా పెట్టుకోవాలని తెలిపారు. దానివలన మనం వాహనం పై ప్రయాణించేటప్పుడు అనుకోకుండా వాహనం పై నుండి కిందపడిపోతే హెల్మెట్ జారిపోకుండా ఉండి, మనకు ప్రమాదం జరగకుండా ఉండే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ తో పాటు ట్రాఫిక్ సిబ్బంది మరియు వాహనదారులు పాల్గొన్నారు.

# తాటిపూడి ఏపీఆర్జేసీ గురుకులంలో విద్యార్థులకు వైరల్ జ్వరాలు

పరిస్థితిపై ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి స్పందన

పాఠశాల, ఏరియా ఆసుపత్రిని సందర్శించి విద్యార్థులకు పరామర్శ



**శృంగవరపుకోట, 30 జూలై 2026, భారత్ ప్రతినిధి :** విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం ఎస్.కోట, మండల పరిధిలోని తాటిపూడి ఏపీఆర్జేసీ (APRJC) గురుకుల పాఠశాలలో పలువురు విద్యార్థులు వైరల్ జ్వరాల భారిన పడినట్లు సమాచారం అందడంతో ఎస్.కోట శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారి తక్షణమే స్పందించారు. విషయం తెలిసిన వెంటనే ఎస్.కోట ఏరియా నిన్న రాత్రి ఆస్పత్రి డాక్టర్లతో ఫోన్‌లో మాట్లాడి విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఈ రోజు ఆమె గురుకుల పాఠశాలను ప్రత్యక్షంగా సందర్శించి, అక్కడ ఉన్నపరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థుల వద్దకు వెళ్లిన ఎమ్మె ల్యే, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గురుకుల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో మాట్లాడి జ్వరాలు వ్యాపించడానికి గల కారణాలను, పాఠశాలలో తీసుకుంటు న్న పారిశుధ్య, వైద్య చర్యలను ఆరా తీశారు. అనంతరం అక్కడి నుంచే విద్యార్థుల తల్లిదండ్రులకు స్వయంగాఫోన్‌చేసి మాట్లాడి, పిల్లల ఆరోగ్యంపై ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. అంతే కాకుండా, విద్యార్థులతో కూడా వారి తల్లిదండ్రులకు ఫోన్లో మాట్లాడించి ధైర్యాన్ని నూరిపోశారు. పాఠశాల సందర్శన అనంతరం, ఎస్.కోట ఏరియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఎమ్మెల్యే లలిత కుమారి పరామర్శించారు. ఆసుపత్రి వార్డుల్లో చికిత్స పొందుతున్న విద్యార్థుల వద్దకు వెళ్లి వారి ఆరోగ్యాన్ని సమీక్షించారు. బాధితులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా మెరుగైన వైద్యం అందించా లని, ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరగా కోలుకునేలా చూడాలని అక్కడి వైద్యులను ఆదేశించారు. అలాగే గురుకుల పాఠశాల ప్రాంగణంలో పారిశుధ్య లోపం తలెత్తకుం డా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# అంగన్‌వాడీ వ్యవస్థ మరింత బలోపేతం

**అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాల స్వీకరణ**

**జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సుల నిర్వహణ**

**అధికారులతో సమీక్షించిన మంత్రి సీతక్క**

**హైదరాబాద్,జూలై30 :** అంగన్‌వాడీ వ్యవస్థను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. అందులో భాగంగా అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాలు, సూచనలు స్వీకరించేందుకు జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పనితీరుపై మంత్రి సీతక్క ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సమస్యలను తక్షణమే గుర్తించి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీచర్లు, ఆయాలకు అందించే నూతన యూనిఫామ్‌లను పరిశీలించి, అక్టోబర్ మొదటి వారంలోగా వాటిని సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుతం 17 ఉన్న శిశు దత్తత కేంద్రాలను విస్తరించి ప్రతి జిల్లాలోనూ ఒక అడాప్షన్ సెంటర్ ఉండేలా చూడాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సంబంధించి ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు ఇచ్చామని అధికారులు తెలిపారు. మిగతా జిల్లాల్లో కలెక్టర్లతో మాట్లాడి నియామక పక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు అందుతున్న పోషకాహారం, వారి ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి నివేదిక అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ నిధులు ల్యాప్స్ కాకుండా పూర్తి స్థాయిలో వినియోగించాలని అధికారులకు నిర్దేశిరచారు. అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపై మంత్రి సీతక్క సమిక్ష నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు జిల్లాల వారీగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో సదస్సులు నిర్వహించి వారి సూచనలు

స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే అంగన్వాడీ టీచర్లు, ఆయాల యూనిఫార్మ్‌లను అక్టోబర్ మొదటి వారంలోగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో అడాప్షన్ సెంటర్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు వేగవంతం చేయాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 17 అడాప్షన్ సెంటర్లు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాల నియామక పక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు జారీ కాగా మిగిలిన జిల్లాల్లో కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల పోషకాహారం, ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి, దాని ఆధారంగా పోషకాహార కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని పేర్కొన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు లాప్స్ కాకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి రూపాయిని సమర్ధవంతంగా వినియోగించాలని మంత్రి అధికారులకు సూచించారు.

# పంపులను ఆన్ చేసి జలాశయాలను నింపాలి

**ప్రభుత్వ తీరుపై మండిపడ్డ మాజీమంత్రి శ్రీనివాసగౌడ్**

**హైదరాబాద్,జూలై30 :** గోదావరి, కృష్ణా నదుల ఎగువన కురుస్తున్న వర్షాలతో భారీగా వరద వచ్చి చేరుతోంది. కానీ ప్రాజెక్టులలోని అన్ని పంపులను ఆన్ చేసి, రిజర్వాయర్లను నింపుకోవాలనే సోయి ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూరాల నుంచి కిందున్న అన్ని రిజర్వాయర్లు, అన్ని పంప్‌సెట్లు ఆన్ చేసుకోవాలి.. అన్ని రిజర్వాయర్లు నింపుకోవాలి.. తాగునీటి అవసరాలకు మాత్రమే మేం నీళ్లిస్తాం.. వ్యవసాయానికి నీళ్లివ్వం అనే ధోరణిలో అధికారులు మాట్లాడుతున్నారు. దాదాపు నిన్న 45-50 వేల క్యూసెక్కుల పవర్ జనరేషన్ పేరు మీద నీళ్లు వదులుతున్నరు.. కానీ ఉన్న రిజర్వాయర్లను నింపాలి.. పంపులు ఆన్ చేయాలనేది మాత్రం విస్మరించారని అన్నారు. గోదావరి, కృష్ణా నదుల ఎగువన కురుస్తున్న వర్షాలతో భారీగా వరద వచ్చి చేరుతోంది. కొన్ని పంపులు ఆన్ చేశారు.. మరికొన్ని చేయలేదన్నారు. నీళ్లు వచ్చినప్పుడు ఒడిసి పట్టుకోవాలి కానీ వదలన్నీ బంద్ అయినప్పుడు ఏం చేస్తరని ప్రశ్నించారు. వరదలు వచ్చి జూరాల నిండుతున్నా పంపులు ఆన్ చేయలేదన్నారు. రైతులంతా ధర్నా చేస్తం.. మేమే ఆన్ చేసుకుంటమని ధర్నా చేస్తే నిన్న ఆన్ చేశారు. ఇన్‌ఎ÷-లో ఎంత ఉందో అవుట్ ఎ÷-లో కూడా అంతే పవర్ జనరేషన్ పేరు మీద మొత్తం కింది వెళ్లిపోతున్నయన్నారు. ఎల్ నినో దృష్ట్యా గోదావరి, కృష్ణా నదుల నుండి కిందకి వృథాగా పోతున్న ప్రతి చుక్కను ఒడిసి పట్టుకోవాల్సిన అవసరం ఉంది. సరైన సమయంలో స్పందించకపోతే పాలమూరు ఎడారి కాక తప్పదని అధికారులు, ప్రభుత్వానికి హెచ్చరించారు.

# గణేశ్ విగ్రహాల గరిష్ట ఎత్తు 16 అడుగులకు పరిమితం

**తయారీదారులను ఆదేశించిన నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్**

**హైదరాబాద్,జూలై30 :** గణెళిశ్ విగ్రహాల గరిష్ట ఎత్తు 16 అడుగులకు పరిమితం చేయాలని తయారీదారులను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆదేశించారు. వినాయక చవితి సమీపిస్తుంది. ఈ నేపథ్యంలో విగ్రహాల తయారీ దశ నుంచే భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలని వారికి స్పష్టం చేశారు. గణెళిశ్ ఉత్సవాలపై హైదరాబాద్ పోలీసులు ముందస్తు సన్నాహాలు చేస్తున్నారు. అందుకోసం గురువారం నగర సీపీ వీసీ సజ్జనర్ అధ్యక్షతన విగ్రహ తయారీదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రశాంతంగా, సురక్షితంగా, పర్యావరణహితంగా ఉత్సవాలు నిర్వహించడమే లక్ష్యమని ఈ సందర్భంగా వారికి సీపీ స్పష్టం చేశారు. గతేడాది హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 23 వేల గణెళిశ్ విగ్రహాలను ప్రతిష్టించినట్లు వివరించారు. విగ్రహాల రవాణా సమయంలో గతేడాది నాలుగు ప్రమాదాలు జరిగాయని నగర సీపీ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో జాగ్రత్తలు తప్పని సరి అని వారికి సూచించారు. మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని తయారీదారులను కోరారు. చిన్న విగ్రహాల ప్రతిష్టాపనపై భక్తులకు అవగాహన కల్పించాలని వివరించారు. విగ్రహాల తయారీ కేంద్రాల్లో ÷ర్ సేఫ్టీ, సురక్షితమైన విద్యుత్ వైరింగ్ నిబంధనను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. దూల్‌పేట్, జల్‌పల్లి, మైలార్‌దేవ్‌పల్లి నుంచి విగ్రహాల రవాణాకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలు ఏర్పాటు చేయాలన్నారు. రద్దీ సమయాల్లో భారీ విగ్రహాల రవాణాను నివారించాలని ఆదేశించారు. రవాణాకు ముందు స్థానిక ట్రాఫిక్ పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. విగ్రహాల బుకింగ్, రవాణా సమయం, మార్గాల వివరాలు ముందుగానే పోలీసులకు ఇవ్వాలని తయారీదారులను ఆదేశించారు. భారీ విగ్రహాల రవాణాలో విద్యుత్ తీగలు, ఫ్లై ఓవర్లు, మెట్రో మార్గాలకు ఆటంకం కలగకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. లోడింగ్, అన్‌లోడింగ్‌కు ఉపయోగించే క్రేన్లు, వాహనాలు సర్టి÷డ్ అయి ఉండాలని వారికి స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని వినాయకుని విగ్రహాల తయారీదారులను నగర సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు.

# ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు

**పొంగిపొర్లుతున్న వాగులు వంకలు**

**ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి, ప్రాణహిత నదులు**

**మేడిగడ్డ వద్ద వరద ఉధృతితో 85 గేట్లు ఎత్తివేత**

**శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పెరిగిన వరద ఉధృతి**

**కడెం జలాశయానికి భారీగా వరదనీరు చేరిక**

**భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి మట్టం**

**ములుగు జిల్లా బొగత జలపాతం సందర్శన నిలిపివేత**



**హైదరాబాద్,జూలై30 :** వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కారణంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలాగే రానున్న మరో మూడు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తెలంగాణ వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు నదులు, ఉపనదులు పొంగిపొర్లుతున్నాయి. ముఖ్యంగా తెలంగాణ, మహారాష్ట్రల్లోని ఎగువ ప్రాంతాల్లో వర్షాపాతం తీవ్రమవడంతో గోదావరి, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో రాష్ట్రంలోని పలు కీలకమైన నీటిపారుదల ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో జలాశయాలు సంతరించుకుంటున్న జలకళ రైతుల్లోనూ, ప్రజల్లోనూ తీవ్ర ఆనందాన్ని నింపుతోంది. నిజామాబాద్ జిల్లాలోని ప్రతిష్టాత్మక శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం జలాశయంలోకి 12,900 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, ప్రాజెక్టు నీటి నిల్వ 17.103 టీఎంసీలకు చేరింది. కాకతీయ కాలువ ద్వారా దిగువకు 300 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. అలాగే, నిర్మల్ జిల్లాలోని సారంగాపూర్ మండలంలో ఉన్న స్వర్ణ ప్రాజెక్టుకు ఉదయం వేళకు నీటి సామర్థ్యం అర టీఎంసీ దాటి, ఇన్ ఫ్లో దాదాపు 10 వేల క్యూసెక్కులకు చేరింది. నిర్మల్ జిల్లాకే తలమానికమైన కడెం ప్రాజెక్టుకు వరద నీరు విపరీతంగా పోటెత్తుతోంది. ఉదయం 11:00 గంటల సమయానికి కడెం ప్రాజెక్టుకు ఏకంగా 77,442 క్యూసెక్కుల భారీ ఇన్ ఎ÷-లో నమోదు కాగా, పరిస్థితికి అనుగుణంగా అధికారులు 6 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఇక జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం వద్ద ప్రాణహిత, గోదావరి ఉభయ నదులు పరవళ్లు తొక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అక్కడ నీటిమట్టం 6.320 మీటర్ల ఎత్తులో మెట్ల వద్దకు చేరడంతో తీరం కొత్త రూపు సంతరించుకుంది. గోదావరి జలాలు పోటెత్తడంతో కాళేశ్వరం ప్రాజెక్ట్ లోని మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ కి ఇన్ ఫ్లో భారీగా పెరిగింది. ఎన్డీఎస్ఏ సూచనలను పాటిస్తూ అధికారులు బ్యారేజ్ కి చెందిన మొత్తం 85 గేట్లను ఎత్తి ఉంచారు. ప్రస్తుతం అక్కడ ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో సమంగా 1,01,530 క్యూసెక్కులుగా కొనసాగు తుండటంతో గోదావరి ప్రవాహం దిగువకు వేగంగా పయనిస్తోంది. ప్రాజెక్టుల్లో క్రమంగా నీటి నిల్వలు పెరుగుతుండటంతో నీటిపారుదల శాఖ అధికారులు పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురియ నుండటంతో 9 జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఉమ్మడి కరీంనగర్, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు భారీ వర్షాల నేపథ్యంలో 6 జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. భారీ వర్షాలకు ఉత్తర తెలంగాణతో పాటు నిజామాబాద్ జిల్లాలోని చెరువులు, కుంటలు అలుగుపోస్తున్నాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షాలను దృష్టిలో పెట్టుకొని జగిత్యాల జిల్లాలో పాఠశాలలకు సెలవను ప్రకటించారు. ఈ సీజన్‌లో తొలిసారిగా జూరాల ప్రాజెక్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదలారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితోపాటు,

పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు గోదావరిలో నీటిమట్టం పెరుగుతోంది. గురువారం ఉదయానికి 27 అడుగులకు చేరింది. నీటిమట్టం ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టుకు వరద పోటెత్తున్నది. దీంతో అప్రమత్తమైన ప్రాజెక్టు అధికారులు ప్రాజెక్టు 6 వరద గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఇన్ ఫ్లోగా ప్రాజెక్టులోకి 77,442 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు 6 వరద గేట్లు 10 ఫీట్లు గేట్లు ఎత్తి అవుట్ ఎ÷-లోగా 67, 000 క్యూసెక్కుల నీటిని దిగవనున్న గోదావరిలోకి అధికారులు వదులుతున్నారు. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు 3.495 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి మట్టం 693.725 అడుగులు 2.212 టీఎంసీలలో ప్రాజెక్టు నీటి సామర్థ్యం కొనసాగుతుంది. కడెం ప్రాజెక్టు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రవాహ ప్రాంతాలకు ఎవరు కూడా వెళ్లకూడదని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రవీణ్ కుమార్ సూచించారు. కడెం ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలని అధికారులు కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు మత్తడి పారుతున్నాయి. ఆదిలాబాద్ సహా ఇంద్రవెల్లి, తలమడుగు మండలాల్లో భారీ వర్షం కురుస్తోంది. ఉట్నూరు, నార్నూరు, జైనూరు మండలాల్లో రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి నర్సాపూర్, శాంతాపూర్ వాగులు పొంగాయి. దీంతో ఆయా ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ బ్యారేజ్‌కి వరద ప్రవాహం పోటెత్తుతుంది. గురువారం బ్యారేజ్ వద్ద 81,060 క్యూసెక్కుల వరద ప్రవాహం రాగా బ్యారేజ్‌లోని 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో వరదనీటిని భారీ నీటిపారుదల శాఖ అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా బ్యారేజీకి వరద ప్రవాహం మరింత పెరుగుతుందని, లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అవసరమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించారు. ములుగు జిల్లా వాజేడు మండలం లో కురుస్తున్న భారీ వర్షానికి చీకుపల్లి అటవీప్రాంతంలో ఉన్న తెలంగాణ నయాగర బొగత జలపాతం ఉప్పొంగింది. జలపాతం ముందు ఉన్న సెల్ఫీ వ్యూ పాయింట్‌పై నుంచి స్విమ్మింగ్ పూల్ మీదుగా ఉధృతంగా ప్రవహించింది. దీంతో బొగత సందర్శనకు అటవీశాఖ అధికారులు మధ్యాహ్నం నుంచి అనుమతి నిలిపివేశారు. తాము టికెట్ తీసుకొని లోపలకు వెళ్లగా అనుమతి లేదని బయటకు పంపించారని, టికెట్ డబ్బులు ఇవ్వాలని అడిగినా అధికారుల నుంచి సమాధానం కరువైందని కొందరు పర్యాటకులు ఆరోపించారు. ఈ విషయంపై ఇన్‌చార్జి రేంజ్ అధికారి నరేందర్‌ను అడగగా అలాంటిదేమీ లేదని, జలపాతం వీక్షించిన తర్వాతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బయటకు పంపించామని తెలిపారు. ఉదయం 6 గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా నమోదయిన వర్షపాతం వివరాలు ఇలావున్నాయి. వాజేడులో అత్యధికంగా వాజేడులో 16.5 సెం.మీ. ఏటూరునాగారం, 15.2, సర్వాయిపేటలో 14.3, జైపూర్‌లో 14 సెం.మీ, బెజ్జూరులో 14, సెం.మీ., కన్నాయిగూడెంలో 13 సెం.మీ., వెంకటాపురం, 12.6, ముత్తారం, మహదేవ్‌పూర్ లో 12.2 సెం.మీ., నస్పూర్ 11.8 సెం.మీ. ఆసిఫాబాద్‌లో 11.3 సెం.మీ., సింగరేణి(రెబ్బన)లో 11.2 సెం.మీ., కాగజ్‌నగర్, మేడారంలో 10.6 సెం.మీ., సిర్పూర్(టి)లో 10.5 సెం.మీ., కౌతాలంలో 104, కాటారంలో 10.3, నెన్నెలలో 10.3 సెం.మీ. వర్షపాతం నమోదయింది.

# వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు

**అధికారులు అప్రమత్తంగా ఉండాలి**

**ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు**

**అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్,జూలై30 :** వాయుగుండం ప్రభావం నేపథ్యంలో భారీ వర్ష్యాలు కురిసే అవకావం ఉండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఛత్తీస్‌గఢ్ మీదుగా పయనిస్తున్న తీవ్ర వాయుగుండం, చురుగ్గా ఉన్న నైరుతి రుతుపవనాల ప్రభావంతో తెలంగాణవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక చేసింది. ఈ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో రెవెన్యూ యంత్రాంగం అన్ని శాఖలతో సమన్వయం చేసుకొని నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురువారం రెవెన్యూ, విపత్తు నిర్వహణ (డిజాస్టర్ మేనేజ్‌మెంట్) అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో గడచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, రాబోయే రెండు రోజుల్లో కురిసే వర్షాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. వాగులు, వంకలు, చెరువులు, జలాశయాల వద్ద ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలి. ప్రమాదకర ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తూ, అవసరమైతే వెంటనే సురక్షిత ప్రాంతాలు లేదా పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి. ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే తక్షణమే స్పందించి సహాయక చర్యలు అందించాలని సూచించారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రవాణా, విద్యుత్, తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలి. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా(హైడ్రా, జిహెచ్ ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సాధారణ జీవనానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నాలుగు రోజుల క్రితం వరకు రాష్ట్రంలో 30శాతం మేర ఉన్న వర్షపాతం లోటు, గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో భర్తీ అయి దాదాపు సాధారణ స్థాయికి చేరుకుందని మంత్రి తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వివిధ జిల్లాలకు అలర్ట్‌లు జారీ అయ్యాయని మంత్రి తెలిపారు. ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశామని అలాగే నిజామాబాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామని తెలిపారు. వచ్చే రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే జిల్లాలపై ప్రధానంగా దృష్టి సారించాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తుగానే చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

# భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

**జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులకు సి.ఎస్. ఆదేశం**


**హైదరాబాద్,జూలై30 :** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఏవిధమైన ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. రాష్ట్రంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, మరో రెండు రోజుల పాటు కురిసే అవకాశం ఉన్నందున చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమీషనర్లు, ఎస్. పి లతో సి.ఎస్ సంజయ్ జాజు గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీజీపీ సి.వీ ఆనంద్, అడిషనల్ డీజీ భగవత్, డిజాస్టర్ మేనేజ్ మెంట్ కార్యదర్శి హరిచందన, నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, గురువారం రాత్రి కూడా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలుపుతున్నందున జిల్లాల్లో పోలీసు వివిధ శాఖలతో సమన్వయంతో తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రతి జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ప్రధానంగా, ఆయా జిల్లాలో వాటర్ ఫాల్స్, ప్రమాదకర ప్రదేశాలు ఉన్న పర్యాటక ప్రాంతాలకు పర్యాటకులు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల కలెక్టర్లు పరిస్థితులను ఎప్పటి కప్పుడు సమీక్షిస్తుండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. ఇప్పటికే, ఎన్.డీ.ఆర్.ఎఫ్, ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచామని, అవసరమైనప్పుడు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. కాగా, ఎల్.నినో ప్రభావం వల్ల సెప్టెంబర్ లోనూ వర్షపాతం తక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ పేర్కొన్నందున వరి కాకుండా ప్రత్యామ్నాయ పంటలను వేసేలా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రధానంగా, కూరగాయలు పండిస్తే మార్కెట్ లో మంచి ధర ఉండడమే కాకుండా హరే కృష్ణ ఫౌండేషన్ ద్వారా కూడా కొనుగోలు చేయించడం జరుగుతుందని సి.ఎస్ అన్నారు. వచ్చే రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే జిల్లాలపై ప్రధానంగా దృష్టి సారించాలని రాష్ట్రంలోని పలు జిల్లాలో249 ప్రమాదకర జలాశయాలున్న పిక్-నిక్ స్పాట్స్ లను గుర్తించామని, మరో 167 పర్యాటక ప్రాంతాలను గుర్తించి భారీ వర్షాలు, వరదలున్న సమయంలో ఈ పర్యాటక ప్రాంతాలకు వెళ్లకుండా పోలీస్ శాఖ తగు చర్యలను చేపట్టిందని డీజీపీ సి.వీ ఆనంద్ వెల్లడించారు.

6

# విద్యార్థులపై పోలీస్ దమనకాండపై

# నోరు విప్పరే!

**ప్రధాని మోడీ మాట్లాడరు..**
**అమిత్ షా సమాధానమివ్వరు**
**మోడీ రాజీనామా చేయాలి... లేదా దిగిపోవాలి**
**అమిత్ షాని వెంటనే తప్పించాలి.**
**ప్రధాన్ రాజీనామా చేసి ప్రధానిని కాపాడారు**
**విద్యార్థులకు జరిగిన నష్టాన్ని ఎవరు భరిస్తారు?**
**ఇంతటి దారుణానికి కారణం ఎవరో తేలాల్సిందే**
**పరీక్షల పేపర్లు లీక్ కాకుండా ముందస్తు చర్యలేవీ?**
**రాజ్యసభలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే**



**న్యూఢిల్లీ :** పరీక్షలు, ఉద్యోగుల భర్తీకి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని మల్లికార్జున ఖర్గే అన్నారు. పాఠశాలలు, కళాశాలలు, వర్సిటీల్లో 10 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. టీచర్ పోస్టులు భర్తీ చేయకుండా వికసిత్ భారత్ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. వర్సిటీల్లో వీసీలు, ప్రొఫెసర్లలో ఆర్ఎస్ఎస్ వాళ్లనే తీసుకుం టున్నారని, అర్హతలు లేకుండానే నియమిస్తున్నారని విమర్శించారు. యూనివర్సిటీల్లో వీసీలు, బోధకులుగా సమర్థులనే నియమించాలని చెప్పారు. విద్యా వ్యవస్థలో మను స్మృతిని, ఆర్ఎస్ఎస్ సిలబసు పెడుతున్నారని ఆరోపించా రు. వేద పాఠశాలల్లో చదివే బడుగు వర్గాలను వేధిస్తున్నారని అన్నారు. పరీక్షా వ్యవస్థలోని వైఫల్యాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా యు-ంవత తమ గళాన్ని తీవ్రంగా వినిపించారు. విద్యార్థుల ఆవేదనను ప్రతిపక్షాలు వీధుల నుంచి పార్లమెంటు వరకు ప్రతిధ్వనిం చేలా చేశాయి. అంతకంతకూ పెరుగుతున్న ప్రజా ఒత్తిడికి తలొగ్గి, ప్రభుత్వం మోకరిల్లాల్సి వచ్చింది. పోరాటం ఫలించి, ప్రభుత్వం మెడలు వంచేలా చేసిన దేశ యువతకు, విద్యార్థులకు నా హృదయపూర్వక అభినందనలు. యువత శక్తికీ భయపడి ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రి ప్రధాను తొలగించక తప్పలేదు. పరిస్థితిని మరింత సాగదీస్తే తమ కుర్చీకే ముప్పు వస్తుందని ప్రభుత్వానికి అర్థమైంది. ఆ భయంతోనే ప్రభుత్వం దిగివచ్చి యువత డిమాండ్లను అంగీకరించింది. అయితే, ఈ నిర్ణయం వెనుక విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాలనే చిత్తశుద్ధి కాదు. కేవలం తమ పదవిని కాపాడుకోవాలన్న స్వార్థం మాత్రమే దాగి ఉంది అని మల్లికార్జున ఖర్గే అన్నారు. పేపర్ లీకేజీ వల్ల నష్టపోయేది విద్యార్థులే అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై ఎన్డీఏ ఎంపీలు నిరసన వ్యక్తం చేశారు. విద్యావ్యవస్మ సిలబస్‌ప ఖర్గే చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సంద ర్భంగా జేపీ నడ్డా మాట్లాడుతూ, మను స్మృతిపై ఖర్గే వ్యాఖ్య లతో సమాజం లో అశాంతి నెలకొంటుందని అన్నారు. ఇలాంటి విషయాలు సభలో ప్రస్తావించడం సరికాదని తెలి పారు. ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తామని చెప్పారు. పలు పార్టీల నుంచి చర్చలో పాల్గొని బిల్లుపై మాట్లాడారు.

### వందేమాతరం బిల్లుకు లోక్ సభ ఆమోదం

వందేమాతరం గేయాన్ని అవమానించడం నేరంగా పరిగణించే బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. రాజ్యసభలో ఆమోదం పొందిన బిల్లుకు లోక్సభకూడా గురు వారం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో త్వరలో ఇది చట్ట రూపం దాల్చ నుంది. ప్రతిపక్షాల నిరసనల నడుమ లోక్సభ మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం తెలిపింది. రాజ్యసభలో ఈ బిల్లును జులై 24న ప్రవేశపెట్టగా జులై 29న ఆమోదం లభించింది. గురువారం లోక్సభ కూడా బిల్లుకు ఆమోదం తెలిపింది. నీట్ పేపర్ లీక్ వ్యతిరేకంగా ప్రతిపక్షాల నిరసనల నడుమ రెండు సభల్లోనూ బిల్లుకు ఆమోదం లభించింది. జాతీయ గేయాన్ని అవమానించడం నేరంగా పరిగణించేలా నేషనల్ ఆనర్ యాక్ట్-1971 చట్టంలో మార్పుల కోసం కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చింది. రాజ్యాంగం, జాతీయజెండా, జాతీయ గీతాన్ని అవమానిం చిన వారికి ప్రస్తుతం గరిష్ఠంగా మూడేళ్ల వరకూ జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది. ఇకపై జాతీయ గయాన్ని అవమానించిన వారికి కూడా ఇదే శిక్ష పడేలా చట్టంలో మార్పులు చేశారు. స్వాతంత్ర ఉద్యమంలో దేశ ప్ర జల్లో స్ఫూర్తి నింపిన ఈ గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తైన నేపథ్యంలో కేంద్రం ఈ గేయానికి మరిన్ని రక్షణలు కల్పిస్తూ తాజా బిల్లును తీసుకొచ్చింది. బంకిమ్ చంద్ర ఛటర్జీ 1875లో ఈ గేయాన్ని రచించారు. ఆనంద్మఠ్ నవలలో భాగంగా తొలిసారి 1882లో ఈ గేయం ప్రచురితమైంది. ఇక ప్రభుత్వ కార్యక్రమా ల్లో జాతీయ గేయం అలాపనకు సంబంధించి కేంద్రం ఇటీవల రాష్ట్రాలకు నూతన మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. ఈ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తెలిపిన అనంతరం చట్టం అమల్లోకి రానుంది.

## పేపర్ లీక్‌లకు చెక్ పెట్టేందుకే బిల్లు

**కొత్త చట్టం ప్రకారమే నీట్ కేసు విచారణ**
**సీబీఐ చార్జ్ షీట్ దాఖలు చేసింది**
**రెండు నెలల్లో దర్యాప్తు పూర్తి**
**కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్**

ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టడం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ బిల్లు గురువారం రాజ్యసభముందుకు వచ్చింది. బిల్లుపై చర్చ సందర్భంగా అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల తూటాలు పేలాయి. విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటం ఆడుతోందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. కేంద్రం మాత్రం తాము పేపర్ లీకేజీలను ఆరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంది. ముందుగా బిల్లును కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ ప్రవేశపెట్టారు. దీనిపై ఏడు గంటల పాటు చర్చించాలనినిర్ణయించారు. బిల్లును ప్రవేశపెట్టిన అనంతరం జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, కొత్త చట్టం ప్రకారమే నీట్ పేపర్ లీక్ కేసు విచారణ జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించినట్లు చెప్పారు. దర్యాప్తు సంస్థ ఇప్పటికే ఛార్జ్ షీటు కూడా దాఖలు చేసినట్లు తెలిపారు. బిల్లుపై చర్చ సందర్భంగా మంత్రి జితేంద్రసింగ్ నీట్ పేపర్ లీక్పై దర్యాప్తు ఐదు నెలల్లో పూర్తవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై మంత్రి జితేంద్రసింగ్ విమర్శలు గుప్పించారు. ఆర్టికల్ 370 రద్దు, ఎన్డీఏ ఏర్పాటు ఆలస్యానికి కారణం ఎవరిని ప్రతిపక్షాలను నిలదీశారు. ఇటీవలి కేసుకు సంబంధించి వెంటనే సీబీఐకి అప్పగించాం. మొన్న ఛార్జిషీట్ దాఖలు చేశాం. బుధవారం నుంచి విచారణ ప్రారంభమైందని తెలియ జేయడానికి సంతోషిస్తున్నాను. ఈ కొత్త చట్టం ప్రకారం దర్యా ప్ర 2 నెలల్లో పూర్తవుతుంది. ఆ తర్వాత మూడునెలల్లో విచార ణ జరుగుతుంది. అంటే మొత్తం 5 నెలల్లో ప్రక్రియ పూర్తవు తుంది. వారినిబద్ధతగా ఉన్న ఆర్టికల్ 370ని రద్దు చేయడానికి 70 ఏళ్లు పట్టింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని తీసుకురాకుండా అడ్డుకోవడానికి 33 ఏళ్లు తీసుకున్నారు. ఇప్పుడు ఈ బిల్లును తీసుకువస్తున్న తరుణంలో వారు చేస్తున్న గగోలు బిల్లుకు వ్యతిరేకం కాదు. ఇకపై ప్రమాదంలో పడ బోయే వారి స్వార్థ ప్రయోజనాలకు వ్యతిరేకంగా జరుగుతున్న గగ్గోలు ఇది. 33 ఏళ్లపాటు వారు చేయలేని పని ఇప్పుడు నెరవేర బోతోంది.

## బీజేపీలో చేరకపోతే మీకు ముప్పే

**భయపెట్టడానికి కేంద్రం ప్రయత్నించింది**
**కుటుంబానికి ముప్పు ఉంటుందని హెచ్చరించారు**
**నిరసనల సమయంలో నిరంతరం ఒత్తిడి ఎదుర్కొన్నాను**
**ధర్మేంద్ర ప్రధాన్కు మరో రూపమే ప్రహ్లాద్ జోషి**
**సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే**




**పుణే:** దేశ వ్యాప్త విద్యార్థి నిరసనల సమయంలో తనను భయపెట్టడానికి కేంద్రం ప్రయత్నించిందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే గురువారం ఆరోపించారు. బీజేపీలో చేరకపోతే తనకూ, తన కుటుంబా నికి ముప్పు వాటిల్లుతుందని బెదిరించారని ఆయన పేర్కొన్నారు. చత్రపతి శంభాజీనగర్ లో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ, నిరసనల సమయంలో తాను నిరంతర ఒత్తిడి ఎదుర్కొన్నానని చెప్పారు. బీజేపీతో చేతులు కలపడానికి నిరాకరిస్తే తన కుటుంబం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని పదేపదే హెచ్చరించారని ఆయన ఆరోపించారు. దేశంలో అత్యున్నత పదవుల్లో ఉన్న వ్యక్తులు తనలాంటి విద్యార్థిని బెదిరించడం సిగ్గు చేటు అని దీప్కే అన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వారు యువ నిరసనకారులను భయపెట్టడానికి పూనుకోవడం ఏమిటని ప్రశ్నించారు. కొత్త కేంద్ర విద్యా శాఖ మంత్రి నియమాకంపై స్పందిస్తూ ఆయన తన పూర్వ విద్యామంత్రికి మరో రూపం మాత్రమేనని కొట్టిపారేశారు. దేశ విద్యాశాఖ మంత్రే అత్యా చారానికి పాల్పడిన వారిని స్వాగతిస్తూ, ప్రశంసిస్తుంది.. ప్రధానమంత్రి ఎటువంటి నాయకత్వాన్ని ఎంచుకున్నారనే దానిపై తీవ్ర ప్రశ్నలు తలెత్తుతాయని అన్నారు. తీవ్రమైన సం కారోపణలు ఎదుర్కొంటున్న వారిని దోషులుగా తేలినవ్యక్తులకు అధికారపక్షం పదేపదే మద్దతు తెలపడం, ఉపశమనం కల్పించడం చేస్తోందని ఆరోపిస్తూ, మాజీ బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగాల్, డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్రామ్ రహీమ్ సింగ్ కేసులను ఆయన ప్రస్తావించారు. బాబా రామ్ దేవ్ రాజకీయ అంశాలపై స్పందించడం మానేసి, పతంజలి ఉత్పత్తులపై వస్తున్న ఆరోపణలపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. యువతను తప్పుడు మార్గంలో ప్రభావితం చేస్తున్నారన్న ఆరోపణలను ఆయన తిప్పికొట్టా రు. "ప్రజాస్వామ్యం కోసం నిలబడటం, ప్రభుత్వాన్ని ప్రశ్నిం చడం, విద్యార్థుల భవిష్యత్తు కోసం, వారి విద్యాహక్కు కోసం పోరాడటాన్ని సంస్కృతిని భ్రష్టు పట్టించడంగా భావిస్తే. నేను అదే పనిని కొనసాగిస్తాను" అని స్పష్టం చేశారు. బీఆర్ అంబె "ద్కర్ రూపొందించిన రాజ్యాంగంపైనా, మహాత్మాగాం ధీ ఆదర్శాలపైనా తనకు పూర్తి విశ్వాసం ఉందని, తన ఉద్యమం శాంతియుతంగా కొనసాగుతుందని దీప్కే తెలిపారు.

### అమిత్ షా రాజీనామా చేయాలి బల ప్రయోగానికి ఆయనే ఆదేశించారు

జూలై 20న జరిగిన "సంసద్ చలో" ర్యాలీలో విద్యార్థులపై బల ప్రయోగం చేయాలన్ని ఆదేశాలు కేంద్ర హోం మంత్రి అమిత్ షా నుంచే వచ్చి ఉంటాయని సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే ఆరోపించారు. ఈ పోలీసు చర్యకు బాధ్యత వహిస్తూ అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయన గురువారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని పేర్కొన్న ఆయన న్యాయ వ్యవస్థతో సహా వివిధ వ్యవస్థల పనితీరుపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకో వడం అనేది ఇప్పుడు కేవలం ప్రతిపక్షానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదని, దీనిని కాపాడేందుక దేశ ప్రజలం దరూ ఏకం కావాలని అన్నారు. అమిత్ షా రాజీనామా చేయాలని లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ డిమాండు దీప్కే మద్దతు తెలిపారు. సీజేపీకి బయటి నుండి నిధులు అందుతున్నా యని, ఆ ఉద్యమాన్ని బయటి శక్తులు నడుపుతున్నాయని అంటున్నారని, ఒకవేళ అలా జరుగు తుంటే అది అమిత్ షా వంటి వ్యక్తి వైఫల్యాన్ని సూచిస్తుందని, ఇక ఆయన చాణక్యుడు ఎలా అవుతాడని ప్రశ్నించారు. సంసద్ చలోపై బల ప్రయోగం చేయాలని అమిత్ షా ఆదేశించి ఉంటారని అన్నారు. రైతు నాయకులకు మా మద్దతు అవసరమైతే, వారికి అండగా ఉంటామని అన్నారు. పోలీసులు బీజేపీ ఆదేశాలను కాకుండా రాజ్యాంగాన్ని అనుసరించాలని దీప్కే అన్నారు. అలాకాకుంటే ఖాకీ నిక్కరు. (ఆర్ఎస్ఎస్ దుస్తులు వేసుకుని, బీజేపీ ప్రధాన కార్యాలయం ముందు నిలబడాలని అన్నారు.

## లీకు మాఫియాను వదిలేది లేదు

**కఠినమైన చట్టాలు అవసరం.. టెక్నాలజీతో సంస్కరణలు**
**యాంటీ పేపర్ లీక్ బిల్లు ఆమోదంపై ప్రధాని మోడీ ఇన్‌స్టాగ్రామ్ వీడియో**



**న్యూఢిల్లీ:** యాంటీ - పేపర్ లీక్ బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందడాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ స్వాగతించారు. దీనిని ఆయన ఒక ప్రధాన పరీక్షా సంస్కరణగా అభివర్ణించా రు. పేపర్ లీక్ మాఫియాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ప్రతిజ్ఞ చేశారు. ఈ చట్టం విద్యార్థుల భవిష్యత్తును కాపాడుతుం దని అన్నారు. అలాగే, టెక్నాలజీ, బలమైన చట్టపరమైన రక్షణలను ఉపయోగించి సంస్కరణలు కొనసాగుతాయని ఆయన నొక్కి చెప్పారు. ఉభయ సభలు బిల్లును ఆమోదించిన తర్వాత ఇన్స్టాగ్రామ్ లో పంచుకున్న వీడియోలో మోడీ మాట్లాడుతూ దీనిని భారతదేశ పరీక్షా వ్యవస్థను సంస్కరించడంలో ఒక ప్రధాన ముందడుగుగా అభివర్ణిస్తూ, పేపర్ లీక్ రాకెట్లలో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. వరుస రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు దశాబ్దాలుగా పేపర్ లీక్ లు సవాలుతో పోరాడు తున్నాయని, దీనివల్ల లక్షలాది మంది విద్యార్థులు భవిష్యత్తు ప్రమాదంలో పడిందని అన్నారు. పరీక్షల ప్రక్రియను బలోపేతం చేయడానికి, వ్యవసలో మార్పులు, వేగవంతమైన యంత్రాంగాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అధికంగా ఉపయోగించడం వంటి సంస్కరణలను ప్రభుత్వం ప్రవేశపెడుతోం దని ప్రధానమంత్రి అన్నారు. ఒక దాని తర్వాత ఒకటిగా నిరంతరం ఆడుగులు వేస్తున్నాము. పరీక్షా వ్యవస్థను సంస్కరించడం, పాస్ట్-ట్రాక్ చర్యలను ప్రవేశపెట్టడం లేదా రాష్ట్రాల నుండి వచ్చే సూచనలను పరిగణనలోకి తీసుకోవడం వంటి విషయాలలో మేము ముందుకు సాగుతున్నాముని అని ఆయన అన్నారు.

## సోషల్ మీడియాలో ప్రధాని రాజీనామా లేఖ

**ఫేక్ లేఖగా గుర్తించిన కేంద్ర సంస్థ పీఐబీ**
**ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచన**

**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేసినట్లు ఆయన సంతకంతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లేఖ పూర్తిగా ఫేక్ అని కేంద్ర ప్రభుత్వ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం నిర్ధారించింది. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి అలాంటి లేఖ ఏదీ విడుదల కాలేదని, మోదీ కూడా దానిపై సంతకం చేయలేదని స్పష్టం చేసింది. నెట్టింట చక్కర్లు కొడుతున్న ఈ ఫేక్ లెటర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అధికారిక వర్గాల నుంచి నిర్ధారణ చేసుకోకుండా ఇలాంటి సందేశాలను నమ్మకూడదని, ఫార్వర్డ్ చేయకూడదని 'ఎక్స్' వేదికగా పీఐబీ సూచించింది. 'ప్రధాని సంతకంతో ప్రచారంలో ఉన్న లేఖ పూర్తిగా ఫేక్. తప్పుడు పత్రాలు, నకిలీ మెసేజ్ల ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టించడం, తప్పుగా ప్రచారం చేయడం, కొన్ని సందర్భాల్లో ఆర్థిక మోసాలకు పాల్పడటం జరుగుతుంది' అని తెలిపింది. వైరల్ పోస్టులను ఆధారంగా చేసుకుని వ్యక్తిగత, ఆర్థిక వివరాలను షేర్ చేసుకోవద్దని, పెట్టుబడుల వంటి నిర్ణయాలు తీసుకోవద్దని పౌరులకు సూచించింది పీఐబీ. అనుమానాస్పద పోస్టులు, నకిలీ పత్రాలు కనిపిస్తే పీఐబీ ఫ్యాక్ట్ చెక్ బృందానికి వాట్సాప్ లేదా ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరింది. కృత్రిమ మేధ ఆధారిత నకిలీ కంటెంట్, ఫోర్జరీ పత్రాలు పెరుగుతున్న నేపథ్యంలో ఏ సమాచారాన్నైనా అధికారిక వర్గాలు ధ్రువీకరించాకే నమ్మాలని అధికారులు సూచిస్తున్నారు.

## చైనా నుంచి ఇరాన్‌కు ఆయుధాలు

**చైనా తీరుపై ట్రంప్ అసహనం**

వాషింగ్టన్,జూలై30(ఆర్ఎన్ఎ): అమెరికా విమానాలు, హెలికాప్టర్లకు తలనొప్పిగా మారిన కొన్ని ఆయుధాలను చైనా నుంచి ఇరాన్ కు సరఫరా చేసేందుకు రంగం సిద్ధమైంది. వీటి రవాణాకు పాకిస్థాన్‌ను మార్గంగా ఎంచుకొన్నట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ సంచలన కథనం ప్రచురించింది. దీంతో అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. పాక్ పేరు ఎత్తకుండా చైనాపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చైనా ఆయుధాల సరఫరా విషయం తెలుసుకొని తాను నిరాశకు గురైనట్లు పేర్కొన్నారు. తాము ఇరాన్‌కు ఆయుధాలు విక్రయించబోమని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ స్వయంగా తనకు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. చైనా, రష్యాల నుంచి ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేయవద్దని గత వారం ట్రంప్ హెచ్చరికలు కూడా జారీ చేశారు. చైనా నుంచి దాదాపు 60 మిలియన్ డాలర్లకు పైగా విలువైన 400 షోల్డర్-ఫైర్డ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల కొనుగోలుకు ఒప్పందం జరిగింది. వీటితో తమ గగనతల రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరాన్ భావిస్తోంది. అయితే.. ఈ డీల్‌కు టెహ్రాన్ పక్షాన హాంకాంగ్ చెందిన ఝూంగ్‌కింగ్ బావోషాంగ్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మధ్యవర్తిగా ఉంది. ఈ క్షిపణులను ఉత్తర చైనా నుంచి పాకిస్థాన్ మీదుగా ఇరాన్‌లోకి చేర్చాలని ప్రణాళిక సిద్ధం చేశారు. కాకపోతే వీటిని భూమార్గంలో తరలిస్తారా..? గగనతలంలో తీసుకెళతారా అనే అంశంపై స్పష్టత లేదు. అయితే ఈ కథనాలను చైనా కొట్టిపారేయడం గమనార్హం. ఈ క్రమంలోనే తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ అంశంపై స్పందించారు.

## ఎన్నికల్లో గెలవకుండా మంత్రిగా ఇంకెంతకాలం

**వరుసగా రెండుసార్లు మంత్రిగా కొనసాగడం సరికాదు**
**బీహార్ మంత్రి దీపక్ ప్రకాశ్‌ను ఉద్దేశించి సుప్రీం వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ :** ఎన్నికల్లో గెలవని వ్యక్తిని ఇంకెంతకాలం మంత్రిగా కొనసాగిస్తారని బిహార్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఆ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దీపక్ ప్రకాశ్ ను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేసింది. ఆరు నెలల గడువు ముగిసిన తర్వాత కూడా ఆ పదవిలో కొనసాగించడంపై సమాధానం చెప్పాలని సమ్రాట్ చౌధరీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. సాధారణంగా ఎన్నికల్లో గెలవని వ్యక్తులు రాష్ట్ర మంత్రిగా నియమితులైతే.. వారు ఆరునెలల్లోగా ఏదో ఒక నియోజకవర్గం నుంచి గెలివాల్సి ఉంటుంది. లేదా శాసనమండలి సభ్యుడిగానైనా ఎన్నిక కావాలి. కానీ దీపక్ ప్రకాశ్ 2025 నవంబర్‌లో పంచాయతీ రాజ్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. తొలుత ఏప్రిల్ 25, 2026 వరకు మంత్రిగా కొనసాగారు. అప్పుడు నీతీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడంతో క్యాబినెట్ మొత్తం రద్దయింది. తర్వాత సమ్రాట్ చౌధరీ నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయగా.. దీపక్ మళ్లీ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మధ్యలో 22 రోజులు ఏ పదవీలో లేరు. అంటే నిరవధికంగా ఆరునెలల పాటు దీపక్ మంత్రిత్వ బాధ్యతల్లో లేనట్లయ్యింది. సాధారణంగా ఆరు నెలల్లోపు శాసనసభకు ఎన్నిక కాకపోతే.. మంత్రి పదవిని కోల్పోతారు. కానీ ఇక్కడ ఒకే మంత్రి విషయంలో ఆరు నెలల గడువును రెండుసార్లు వినియోగి చడం ప్రస్తుతం వివాదాస్పదమవుతోంది. దీపక్ ఎన్నికల్లో గెలవకపోయినా ఆయనను రెండోసారి మంత్రిగా నియమించడాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఇది రాజ్యాంగాన్ని మోసం చేయడమే అవుతుందని, మంత్రి పదవి కేటాయింపు చెల్లనిదిగా ప్రకటించాలని పిటిషనర్ కోరారు. ఈ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇది చట్టాన్ని ప్రశ్నించడమే అవుతుంది. ఎన్నిక కాకుండా ఒక మంత్రిని ఆరునెలలకు పైగా ఎలా కొనసాగిస్తున్నారనే దానిపై సమాధానం ఇవ్వాలని అత్యున్నత న్యాయస్థానం బిహార్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే తదుపరి విచారణను ఆగస్టు 4కు వాయిదావేసింది. ఇదిలా ఉంటే.. ప్రమాణస్వీకారం సమయంలో కూడా దీపక్ వార్తల్లో నిలిచారు. ప్రముఖ రాజకీయ నాయకులంతా కుర్తా, పైజామా, ధోవతీలతో రాగా.. దీపక్ మాత్రం చాలా డిఫరెంట్‌లుక్‌లో కనిపించి, అప్పట్లో అందరి దృష్టిని ఆకర్షించారు. క్యాజువల్ షర్ట్, ప్యాంట్ ధరించిన ఆయన.. అదే వేదికపై ఉన్న ప్రధాని మోదీని కలిశారు. రాష్ట్రీయ లోక్ మోర్చా చీఫ్ ఉపేంద్ర కుశ్వాహా కుమారుడే ఈ దీపక్. ఆయన తల్లి ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

# ఆటకు వీడ్కోలు పలికిన అజింక్య రహానె

అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన అజింక్య రహానె

సోషల్ మీడియాలో భావోద్వేగ వీడియో ద్వారా వీడ్కోలు సందేశం

ఆస్ట్రేలియా గడ్డపై చారిత్రక టెస్ట్ సిరీస్ విజయాన్ని అందించిన కెప్టెన్

భారత్ తరఫున 85 టెస్టులు, 90 వన్డేలు ఆడి 8000కు పైగా పరుగులు

కుటుంబం, అభిమానులకు కృతజ్ఞతలు తెలుపుతూ కన్నీటి పర్యంతం






టీమిండియా సీనియర్ బ్యాటర్, ఆస్ట్రేలియా గడ్డపై చారిత్రక టెస్ట్ సిరీస్ విజయాన్ని అందించిన కెప్టెన్ అజింక్య రహానె తన ఆటకు వీడ్కోలు పలికాడు. సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగ వీడియో సందేశం ద్వారా అన్ని ఫార్మాట్ల క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకుంటున్నట్లు ప్రకటించాడు. ఈ ప్రకటన చేస్తున్న సమయంలో ఆయన కన్నీటి పర్యంతమవడం అభిమానులను కదిలించింది. భారత క్రికెట్‌లో అత్యంత నమ్మకమైన టెస్ట్ బ్యాటర్‌గా, ముఖ్యంగా విదేశీ పిచ్‌లపై మేటి ఆటగాడిగా పేరుపొందిన రహానె ప్రస్థానం దీంతో ముగిసినట్లయింది. 2020-21 బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ రహానె కెరీర్‌లో శిఖరాగ్రం లాంటిది. రెగ్యులర్ కెప్టెన్ విరాట్ కోహ్లీ తొలి టెస్ట్ తర్వాత స్వదేశానికి తిరిగి రావడంతో, గాయాలతో సతమతమవుతున్న జట్టుకు రహానె నాయకత్వం వహించాడు. అడిలైడ్‌లో ఘోర పరాజయం తర్వాత మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో మ్యాచ్ విన్నింగ్ సెంచరీతో జట్టును ముందుండి నడిపించాడు. ఆ సిరీస్‌ను 2-1 తేడాతో గెలిపించి, భారత క్రికెట్ చరిత్రలోనే చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. "ప్రతిదానికీ ఒక ఆరంభం, ముగింపు ఉంటాయి. సమయం వచ్చినప్పుడు దాన్ని గౌరవించి ముందుకు సాగాలి. నేను నా బ్యాటింగ్‌లో టైమింగ్‌పైనే ఆధారపడ్డాను, దాని ప్రాముఖ్యత నాకు తెలుసు. ఇప్పుడు తప్పుకోవడానికి ఇదే సరైన సమయమని భావిస్తున్నాను. అందుకే అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు అన్ని ఫార్మాట్ల నుంచి రిటైర్ అవుతున్నాను" అని రహానె తన వీడియోలో పేర్కొన్నాడు. "ముంబైలోని డొంబివాలి నుంచి ప్రాక్టీస్ కోసం ప్రయాణించిన చిన్నప్పటి నుంచి ఈ ఆటకు నా సర్వస్వాన్ని ఇచ్చాను. దేశం కోసం, జట్టు కోసమే ఆడాలనే నియమంతోనే జీవించాను," అని రహానె తెలిపాడు. తన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు కృతజ్ఞతలు తెలుపుతూ కన్నీళ్లు పెట్టుకున్నాడు. "నా ప్రయాణం ముగిసినా, ఆటతో నా బంధం ముగియదు. తర్వాతి తరానికి మార్గనిర్దేశం చేస్తాను. అభిమానుల ప్రేమకు నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. క్యాప్ నంబర్ 278, సైనింగ్ ఆఫ్" అంటూ తన సందేశాన్ని ముగించాడు.

## టీమిండియా తరఫున రహానె కెరీర్ ఇలా..

రహానె తన అంతర్జాతీయ కెరీర్‌లో 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. మొత్తంగా 8,000కు పైగా పరుగులు సాధించాడు. టెస్టుల్లో 12 సెంచరీలతో 5,077 పరుగులు చేశాడు. అందులో చాలా సెంచరీలు విదేశాల్లో, కఠినమైన పరిస్థితుల్లో చేసినవే కావడం విశేషం. 2023 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌లో ఆస్ట్రేలియాతో తలపడిన భారత జట్టులో రహానె సభ్యుడిగా ఉన్నాడు. అదే ఏడాది జూలైలో వెస్టిండీస్‌తో జరిగిన టెస్టే అతనికి చివరి అంతర్జాతీయ మ్యాచ్. ఆ తర్వాత జట్టులో చోటు కోల్పోయిన అతను, రంజీ ట్రోఫీలో ఆడి పునరాగమనం కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో చివరకు రిటైర్మెంట్ నిర్ణయం తీసుకున్నాడు.

## ఓటమి ఎరుగని కెప్టెన్‌కు బీసీసీఐ సలాం

భారత సీనియర్ బ్యాటర్, టెస్టుల్లో జట్టుకు చారిత్రక విజయాలు అందించిన అజింక్య రహానె అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకుంటున్నట్లు నేడు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక భావోద్వేగ వీడియో ద్వారా ప్రకటించాడు. దీంతో దాదాపు రెండు దశాబ్దాల పాటు సాగిన ఆయన కెరీర్‌కు తెరపడింది. రహానె రిటైర్మెంట్ ప్రకటనపై బీసీసీఐ వెంటనే స్పందించి, ఆయన సేవలను కొనియాడింది.

"ఒక అద్భుతమైన కెరీర్ ముగిసింది. భారత క్రికెట్‌కు మీరు అందించిన అపారమైన సేవలకు, చిరకాలం గుర్తుండిపోయే జ్ఞాపకాలకు ధన్యవాదాలు. మీ తదుపరి ప్రయాణానికి మా శుభాకాంక్షలు" అని బీసీసీఐ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పోస్ట్ చేసింది.

## కెప్టెన్‌గా చెరగని ముద్ర

బ్యాటర్‌గానే కాకుండా కెప్టెన్‌గా కూడా రహానె తనదైన ముద్ర వేశాడు. టెస్టుల్లో ఓటమి ఎరుగని కెప్టెన్‌గా ఆయనకు అరుదైన రికార్డు ఉంది. కనీసం ఐదు మ్యాచ్‌లకు నాయకత్వం వహించిన భారత కెప్టెన్లలో అత్యధిక విజయశాతం రహానెదే కావడం విశేషం. అతని సారథ్యంలో భారత్ నాలుగు టెస్టుల్లో గెలిచి, రెండింటిని డ్రా చేసుకుంది. ఆస్ట్రేలియా గడ్డపై 2020-21లో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భారత జట్టును చారిత్రక విజేతగా నిలపడం అతని కెప్టెన్సీ కెరీర్‌లో మరుపురాని ఘట్టం. విరాట్ కోహ్లీ గైర్హాజరీలో జట్టును ముందుండి నడిపించిన రహానె, మెల్‌బోర్న్‌లో అద్భుత విజయాన్ని అందించాడు. ముఖ్యంగా గబ్బాలో ఆస్ట్రేలియాకు ఏళ్ల తరబడి ఉన్న ఓటమి ఎరుగని రికార్డుకు బ్రేక్ వేసి సిరీస్‌ను 2-1 తేడాతో భారత్ కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో పాటు 2017లో ధర్మశాలలో ఆస్ట్రేలియాపై, 2018లో ఆఫ్ఘనిస్థాన్‌పై కూడా జట్టును విజయపథంలో నడిపించాడు.

## మూడు ఫార్మాట్లలో గణాంకాలు

తన కెరీర్‌లో రహానే 85 టెస్టులు ఆడి 12 సెంచరీలు, 26 అర్ధ సెంచరీలతో కలిపి 5,077 పరుగులు చేశాడు. 90 వన్డేలలో 3 సెంచరీలు, 24 అర్ధ సెంచరీలతో 2,962 పరుగులు సాధించాడు. ఇక, 20 టీ20 మ్యాచ్‌లలో ఒక అర్ధ సెంచరీతో 375 పరుగులు చేశాడు. ఆటగాడిగా, నాయకుడిగా భారత క్రికెట్‌పై చెరగని ముద్ర వేసిన రహానె రిటైర్మెంట్‌తో ఒక శకం ముగిసినట్లయింది.

# కామన్వెల్త్‌లో నీరజ్ దూకుడు

## రోహిత్, యశ్‌వీర్‌తో కలిసి ఫైనల్‌కు




గ్లాస్గో వేదికగా జరుగుతున్న 2026 కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్‌కు జావెలిన్ త్రో విభాగంలో శుభారంభం లభించింది. ఒలింపిక్ ఛాంపియన్ నీరజ్ చోప్రాతో పాటు రోహిత్ యాదవ్, యశ్‌వీర్ సింగ్ ముగ్గురూ పురుషుల జావెలిన్ త్రో ఫైనల్‌కు అర్హత సాధించారు. బలమైన గాలుల కారణంగా అథ్లెట్లకు త్రో విసరడం కష్టంగా మారినా, అత్యుత్తమ ప్రదర్శన చేసిన 12 మంది ఫైనల్‌కు చేరుకున్నారు. శుక్రవారం జరిగే ఫైనల్లో ఈ ముగ్గురు భారత అథ్లెట్లు పతకాల కోసం పోటీ పడనున్నారు. ఈ అర్హత పోటీలో ఆటోమేటిక్ క్వాలిఫికేషన్ దూరమైన 84 మీటర్లను ఏ అథ్లెట్ అందుకోలేకపోయాడు. నీరజ్ చోప్రా తన రెండో ప్రయత్నంలో 79.61 మీటర్లు విసిరి ఐదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరాడు. అప్పటికే అర్హత ఖరారవడంతో చివరి ప్రయత్నాన్ని ఉపయోగించుకోలేదు. రోహిత్ యాదవ్ 78.37 మీటర్లు విసిరి తొమ్మిదో స్థానంలో నిలిచాడు. యశ్‌వీర్ సింగ్ 78.36 మీటర్లుతో పదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించాడు. గతేడాది సెప్టెంబర్ నుంచి నీరజ్ చోప్రాను నడుము కింది భాగం గాయం వేధిస్తోంది. ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు ముందు ఈ గాయం కావడంతో అతను ఆశించిన స్థాయిలో రాణించలేక ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. గాయం కారణంగా ఈ ఏడాది సీజన్‌ను కూడా ఆలస్యంగా ప్రారంభించాడు. జూన్‌లో జరిగిన దోహా డైమండ్ లీగ్‌లో ఒక్కసారి మాత్రమే బరిలోకి దిగి 85.69 మీటర్లు విసిరి నాలుగో స్థానంలో నిలిచాడు. అర్హత పోటీలో శ్రీలంక అథ్లెట్ రుమేశ్ పతిరాజే 82.84 మీటర్లు విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ సీజన్‌లో అతని పేరిట ప్రపంచంలోనే అత్యుత్తమ త్రో 92.62 మీటర్లు ఉంది. గ్రెనడాకు చెందిన రెండుసార్ల ప్రపంచ ఛాంపియన్ అండర్సన్ పీటర్స్ 81.29 మీటర్లతో రెండో స్థానంలో నిలి చాడు. దక్షిణాఫ్రికా అథ్లెట్ డౌ స్మిట్ 80.64 మీటర్లతో మూడో స్థానం దక్కించుకున్నాడు. ఇంగ్లండ్‌కు చెందిన బెన్ ఈస్ట్ నాలుగో స్థానంలో నిలవగా, ఆస్ట్రేలియా అథ్లెట్ కామెరాన్ మెక్‌ఎంటైర్ ఆరో స్థానంలో నిలిచాడు. ఒలింపిక్ ఛాంపియన్, పాకిస్థాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ ఈ సీజన్‌లో తన అత్యుత్తమ ప్రదర్శనగా 78.63 మీటర్లు విసిరి ఏడో స్థానంతో ఫైనల్‌కు చేరాడు. దీంతో శుక్రవారం జరిగే ఫైనల్లో నీరజ్ చోప్రా, అర్షద్ నదీమ్ మధ్య మరో ఆసక్తికర పోరు చూసే అవకాశం ఏర్పడింది.

# ఇంగ్లండ్ టెస్టు సారథిగా మళ్లీ జో రూట్..

## హెడ్ కోచ్‌గా స్టీఫెన్ ఫ్లెమింగ్





ఇంగ్లండ్ టెస్టు క్రికెట్‌లో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. స్టార్ బ్యాటర్ జో రూట్ రెండోసారి టెస్టు జట్టు కెప్టెన్‌గా నియమితులయ్యాడు. అదే సమయంలో న్యూజిలాండ్ మాజీ కెప్టెన్, ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన కోచ్‌లలో ఒకరైన స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను టెస్టు జట్టు హెడ్ కోచ్‌గా ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ఎంపిక చేసింది. ఈ మేరకు నేడు అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఇటీవల మాజీ కెప్టెన్ బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడం, టెస్టు హెడ్ కోచ్ పదవి నుంచి బ్రెండన్ మెకల్లమ్‌ను తొలగించడంతో ఈ కీలక నియామకాలు జరిగాయి. గతంలో 2017 నుంచి 2022 వరకు రూట్ 64 టెస్టుల్లో ఇంగ్లండ్‌కు సారథ్యం వహించాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లోనూ తాత్కాలిక కెప్టెన్‌గా జట్టును నడిపించాడు. టెస్టు క్రికెట్‌లో 14,000 పరుగులకు పైగా సాధించి, సచిన్ టెండూల్కర్ తర్వాత అత్యధిక పరుగుల జాబితాలో రెండో స్థానంలో ఉన్నాడు. ఈ సందర్భంగా రూట్ మాట్లాడుతూ.. "మళ్లీ ఇంగ్లండ్ టెస్టు జట్టుకు కెప్టెన్‌గా ఎంపికవడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఇది కష్టమైన బాధ్యత అయినా, ఎంతో సంతృప్తినిస్తుంది. తర్వాతి తరం ఆటగాళ్లను ముందుకు నడిపించడానికి ఉత్సాహంగా ఉన్నాను" అని తెలిపాడు. ఫ్లెమింగ్‌ను ఆటపై అపారమైన పరిజ్ఞానం ఉన్న అద్భుతమైన నాయకుడిగా అభివర్ణించాడు. మరోవైపు చెన్నై సూపర్ కింగ్స్‌కు ఐదు ఐపీఎల్ టైటిళ్లు అందించిన స్టీఫెన్ ఫ్లెమింగ్ నియామకాన్ని ఈసీబీ మేనేజింగ్ డైరెక్టర్ రాబ్ కీ సమర్థించాడు. ఫ్లెమింగ్ ప్రపంచ క్రికెట్‌లో అత్యంత గౌరవనీయమైన కోచ్‌లలో ఒకరని, జట్టులోని ప్రతిభను ప్రపంచ స్థాయి ప్రదర్శనగా మార్చగలరని విశ్వాసం వ్యక్తం చేశాడు. ఫ్లెమింగ్ మాట్లాడుతూ.. "ప్రస్తుత విజయాలతో పాటు జట్టుకు మధ్యకాలిక, దీర్ఘకాలిక భవిష్యత్తును అందించడమే లక్ష్యం. కెప్టెన్ జో రూట్‌తో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నాను. అతను తరానికి ఒక్కడొచ్చే ప్రతిభావంతుడు" అని పేర్కొన్నాడు. ఆగస్టు 19 నుంచి పాకిస్థాన్‌తో ప్రారంభం కానున్న మూడు మ్యాచ్‌ల సిరీస్‌కు మార్కస్ ట్రెస్కోథిక్ తాత్కాలిక హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తాడు. ఆ తర్వాత ఫ్లెమింగ్ బాధ్యతలు స్వీకరిస్తాడు. బ్రెండన్ మెకల్లమ్ ఇంగ్లండ్ పరిమిత ఓవర్ల జట్లకు కోచ్‌గా కొనసాగుతాడు.

# 100 మీటర్ల రేసులో భారత్‌కు స్వర్ణ, రజత పతకాలు

కామన్వెల్త్ గేమ్స్ 2026 పారా అథ్లెటిక్స్‌లో భారత్ చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. పురుషుల 100 మీటర్ల ౨47 స్ప్రింట్ ఈవెంట్‌లో భారత అథ్లెట్లు స్వర్ణ, రజత పతకాలను కైవసం చేసుకుని సత్తా చాటారు. దిలీప్ మహాదు గవిత్ సరికొత్త గేమ్స్ రికార్డుతో స్వర్ణం గెలవగా, మహమ్మద్ బాసిల్ రజత పతకాన్ని సాధించి అద్భుతమైన 1-2 ఫినిష్‌ను అందించాడు. బుధవారం జరిగిన ఫైనల్ రేసులో దిలీప్ గవిత్ కేవలం 10.71 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తి చేసి, పాత గేమ్స్ రికార్డును బద్దలుకొట్టాడు. అతడి వెనుకే వచ్చిన మహమ్మద్ బాసిల్ 10.83 సెకన్ల టైమింగ్‌తో తన సీజన్‌లోని ఉత్తమ ప్రదర్శన ఇచ్చి రజతాన్ని అందుకున్నాడు. ఇంగ్లండ్‌కు చెందిన కెవిన్ శాంటోస్ (10.85 సెకన్లు) కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు. ఈ క్రీడల్లో వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను, షాట్‌పుట్‌లో షర్మిల తర్వాత భారత్‌కు ఇది మూడో స్వర్ణం. ఈ విజయంతో కామన్వెల్త్ క్రీడల్లో భారత్ మొత్తం పతకాల సంఖ్య 15కు చేరింది. ఇందులో 3 స్వర్ణాలు, 9 రజతాలు, 3 కాంస్యాలు ఉన్నాయి. మహారాష్ట్రలోని నాసిక్ సమీపంలోని ఓ చిన్న గ్రామంలో జన్మించిన దిలీప్ గవిత్, చిన్నతనంలో చెట్టుపై నుంచి పడి తన చేయిని కోల్పోయాడు. అయినప్పటికీ పట్టుదలతో పారా అథ్లెటిక్స్‌లో రాణిస్తూ దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నాడు. 2022 ఏషియన్ పారా గేమ్స్‌లోనూ గవిత్ స్వర్ణం సాధించిన సంగతి తెలిసిందే.

# రామాయణ ట్రైలర్ విడుదల

## అద్భుత దృశ్య కావ్యంగా మలచిన నితీశ్ తివారి



ఎన్నిసార్లు విన్నా.. ఎంతమంది చెప్పినా.. ఎన్ని యుగాలు మారినా అజరామరం రామ చరితం.. 'రామాయణం' నిత్యనూతనం. ఇప్పటికే ఎన్నోసార్లు దృశ్యరూపం దాల్చిన ఈ మహాకావ్యం ఇప్పుడు మరోసారి నేటితరం ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది.దర్శకుడు నితీశ్ తివారీ మలిచిన 'రామాయణ' ట్రైలర్ బ్రహ్మ ముహూర్తంలో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అత్యున్నత నిర్మాణ విలువలు, అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్, అబ్బురపరిచేలా ఉన్న హాలీవుడ్ స్థాయి గ్రాఫిక్స్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. సీతారాముల కల్యాణం, వనవాసం, రామరావణుడి యుద్ధం.. ఇలా ప్రతి ఫ్రేమ్ ఆ అద్భుత గాథను కళ్లకు కడుతోంది. దేవలోకం.. భూలోకం.. పాతాళలోకం.. ముల్లోకాల్లో ఇక ఒక్కటే సామ్రాజ్యం.. రావణ రాజ్యం' అంటూ యశ్ పాత్రను పరిచయం చేస్తూ ట్రైలర్ ప్రారంభమైంది. యశ్ స్క్రీన్‌పై కనిపించిన ప్రతిసారీ తన గాంభీర్యం ప్రేక్షకులను మైమరిపించింది. 'చీకట్లను పారదోలేందుకు ప్రతి యుగంలోనూ ఆ శ్రీమహావిష్ణువు అవతారమెత్తుతాడు' అంటూ రాముడి పాత్రను తీర్చిదిద్దిన విధానం ఆకట్టుకుంది. ప్రశాంతత, ధర్మనిష్ఠను ప్రతిబింబించే రాముడిగా రణ్‌బీర్ కపూర్ ఆకట్టుకున్నారు. మొత్తం నాలుగు నిమిషాల ఈ ట్రైలర్ సినీ ప్రేక్షకులను త్రేతాయుగానికి తీసుకెళ్లింది. ట్రైలర్‌లో ఎక్కువ చర్చిస్తున్న పాత్రల్లో ఒకటి సీతాదేవి. సాధారణంగా మృదుస్వభావిగా చూపించే సీతమ్మను ఇందులో ఖడ్గం పట్టిన యోధురాలిగా చూపించారు. లక్ష్మణ రేఖ సందర్భంలో కూడా ఆమె చేతిలో ఖడ్గం కనిపించడంతో ఇందులో ఆమె పాత్రను కొత్తగా చూపించనున్నట్లు అర్థమవుతోంది. పుష్పక విమానం రామాయణంలో ఎంతో కీలకం. గతంలో వచ్చిన చిత్రాల్లో ఇది సాధారణంగా కనిపించినా.. ఈ సినిమాలో మాత్రం భారీ తామరపువ్వు ఆకారంలో ప్రత్యేక డిజైన్‌తో చూపించారు. ఇక, లంకను జయించిన తర్వాత మూడు లోకాలపై ఆధిపత్యం సాధించాలని రావణుడు సంకల్పిస్తాడు. ఈ క్రమంలో దేవేంద్రుడితో యుద్ధానికి సంబంధించిన సన్నివేశాల్లో ఐరావతాన్ని అద్భుతమైన విజువల్‌తో ఆవిష్కరించారు. సీతను అపహరించే సమయంలో రావణుడిని అడ్డుకునే జటాయువు పాత్రకు ట్రైలర్‌లో మంచి ప్రాధాన్యం దక్కింది. భారీ గరుత్మంతుడిలా, శక్తిమంతమైన రూపంలో జటాయువును చూపించడం విశేషం. శూర్పణఖ భర్త విద్యుజ్జిహ్వా పాత్రలో వివేక్ ఒబెరాయ్ కనిపించారు. రావణుడికి ఆయనకు మధ్య జరిగే ఘర్షణ చూస్తుంటే.. ఇప్పటివరకూ రామాయణంలో తెరపైకి రాని పాత్రలకు కూడా సముచిత స్థానం కల్పించినట్లు తెలుస్తోంది. రాముడి వనవాసానికి కారణమైన మంథర పాత్రను శీబా చద్దా పోషించారు. కైకేయిగా లారా దత్త ప్రత్యేకంగా కన్పించారు. శివధనుస్సు విరిచిన అనంతరం పరశురాముడు రాముడిని కలిసే ఘట్టం కూడా ట్రైలర్‌లో ఉంది. తన ధర్మ బాధ్యతలను రాముడికి అప్పగించి తపస్సు కోసం వెళ్లే పరశురాముడి పాత్రలోనూ రణ్‌బీర్ కన్పించడం ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేసింది. రాముడిని తిరిగి అయోధ్యకు తీసుకురావడానికి చిత్రకూటానికి వెళ్తాడు భరతుడు. రాముడు నిరాకరించడంతో ఆయన పాదుకలను సింహాసనంపై ఉంచి రాజ్యాన్ని పాలించిన సోదరుడిగా ఆదినాథ్ కొఠారే ఆకట్టుకున్నారు. హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్ష్మణుడిగా రవీ దూబే కూడా తమ పాత్రలకు న్యాయం చేశారు. రకుల్ ప్రీత్ సింగ్ శూర్పణఖ పాత్రలో కనిపించి ఔరా అనిపించారు. రాముడిని ఆకర్షించేందుకు ప్రయత్నించడం, లక్ష్మణుడు ఆమె ముక్కు కోసే సన్నివేశాలు ప్రత్యేకంగా నిలిచాయి. 'ప్రతీకారం తీర్చుకుంటాను శూర్పణఖ.. రాముడికి జరిగే అవమానం ఘోరంగా ఉంటుంది' అంటూ యశ్ చెప్పే డైలాగ్‌తో రామ-రావణ యుద్ధం ఎంత భీకరంగా ఉంటుందో ట్రైలర్‌లో హింట్ ఇచ్చారు దర్శకుడు. ఇక ట్రైలర్‌లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన మరో విషయం.. నేపథ్య సంగీతం.. ప్రపంచ ప్రఖ్యాత సంగీత దర్శకుడు హాన్స్ జిమ్మర్‌తో పాటు ఏ.ఆర్. రెహమాన్ అందించిన సంగీతం సినిమా స్థాయిని మరింత పెంచేలా ఉంది. విజువల్స్‌కు తగ్గట్టుగా వినిపించిన సంగీతం.. ప్రతి సన్నివేశానికి వీక్షకులు లీనమయ్యేలా ఉంది. 'రామాయణ' ట్రైలర్ కేవలం ఓ సినిమా ప్రమోషన్‌లా కాకుండా భారతీయ ఇతిహాసాన్ని ప్రపంచ స్థాయిలో ఆవిష్కరించే మహత్తర సినీ ప్రయాణానికి నాందిగా నిలిచింది. మొదటి భాగం ఈ ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా విడుదల చేసిన ట్రైలర్‌లో విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి రూ.4000 కోట్ల బడ్జెట్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. రామానంద్ సాగర్ ఆవిష్కరించిన ధారావాహికలో రాముడిగా కనువిందు చేసిన అరుణ్ గోవిల్ ఇప్పుడు దశరథుడిగా నటిస్తున్నారు. సీబా చద్దా.. మంథర పాత్ర పోషిస్తుండగా, శిశిర్ శర్మ వశిష్ఠ మహర్షిగా, అజింక్య దేవ్ విశ్వామిత్ర మహర్షిగా చేస్తున్నారు.

# మరో లవ్ గ్రాక్ మూవీ శ్రీనివాస మంగాపురం

## ఆకట్టుకున్న జయకృష్ణ, రాషా తండానీ నటన

ఘట్టమనేని కుటుంబం నుంచి యువ హీరోగా పరిచయమవుతున్న జయకృష్ణ, ప్రముఖ నటి రవీనా టండన్ కూతురు రాషా తడాని జంటగా నటించిన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. 'ఆర్ఎక్స్ 100', మంగళవారం వంటి సంచలన చిత్రాల తర్వాత దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ చిత్రంపై మొదటి నుంచి భారీ అంచనాలున్నాయి. మోహన్ బాబు, శ్యామ్, బ్రహ్మాజీ వంటి హేమాహేమీలు ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తిరుపతి నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. నగరంలో అడుగుపెట్టిన యువకుడు శ్రీను (జయకృష్ణ) .. అక్కడి పవర్ ఫుల్ వ్యక్తి పెద్దిరెడ్డి (శ్యామ్) గారాల కూతురు మంగ (రాషా తడాని)ని మొదటి చూపులోనే ఇష్టపడతాడు. ఆమెకు చేరువయ్యే ప్రయత్నంలో ఉండగా, మంగ జీవితానికి సంబంధించి ఒక షాకింగ్ నిజం తెరపైకి వస్తుంది. అసలు ఆ రహస్యాన్ని పెద్దిరెడ్డి ఎందుకు దాచాడు? శ్రీను నేపథ్యం ఏమిటి? మంగతో అతనికి ఉన్న పాత సంబంధం ఏంటి? బళ్లారి ప్రాంతానికి చెందిన వెంకటప్పయ్య (మోహన్ బాబు), లక్ష్మీపతి (అజయ్)ల మధ్య జరిగిన వివాదాలు ఈ కథను ఎలాంటి మలుపులు తిప్పాయి? చివరికి శ్రీను తన ప్రేమను ఎలా గెలుచుకున్నాడు అనేదే ఈ చిత్ర అసలు కథ. దర్శకుడు అజయ్ భూపతి కూడా 'శ్రీనివాస మంగాపురం' కోసం ఇదే రొటీన్ మాస్ కమర్షియల్ బాటపట్టారు. స్టోరీ పరంగా పెద్దగా కొత్తదనం లేకపోయినా.. విలన్ క్రూరత్వం, హీరోయిన్ వెనక హీరో పడే లవ్ ట్రాక్, మధ్య మధ్యలో వచ్చే పాటలతో ప్రథమార్థం సాగిపోతుంది. జై కృష్ణ తన డాన్సులతో అలరించగా, నరేష్, బ్రహ్మాజీల కామెడీ మంచి రిలాక్సేషన్ ఇస్తుంది. ద్వితీయార్థంలో వచ్చే ఫ్లాష్ బ్యాక్, హీరో హీరోయిన్ల అసలు కథ, యాక్షన్ సీక్వెన్సెస్ ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతాయి. తన గత చిత్రాల తరహాలో కాకుండా, అజయ్ భూపతి ఎలాంటి రిస్క్ తీసుకోకుండా పూర్తిగా 'సేఫ్ గేమ్' ఆడేశారు. పకడ్బందీ స్క్రీన్ ప్లే, బలమైన క్యారెక్టరైజేషన్స్‌పై మరికాస్త దృష్టి పెట్టి ఉంటే ఈ లవ్ అండ్ యాక్షన్ డ్రామా మరో స్థాయిలో ఉండేది. జయకృష్ణ, రాషా తడాని తమ తొలి సినిమాతోనే అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. ముఖ్యంగా జయకృష్ణ ఎమోషనల్ సన్నివేశాల్లో మంచి పరిణతి చూపించాడు. డాన్సులు, యాక్షన్ సీక్వెన్స్‌లలోనూ ఆకట్టుకున్నాడు. రాషా తడాని కూడా తన అందం, అభినయంతో తొలి చిత్రంతోనే మంచి మార్కులు కొట్టేసింది. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ సినిమాకే హైలైట్‌గా నిలిచింది. మోహన్ బాబు తన సీనియారిటీతో, పవర్ ఫుల్ ఇంటెన్సిటీతో పాత్రకు పూర్తి వన్యాయం చేశారు. కిక్ శ్యామ్, అజయ్ తమ విలనిజంతో సినిమాను నిలబెట్టగా.. బ్రహ్మాజీ, నరేష్‌ల కామెడీ అక్కడక్కడా నవ్విస్తుంది. దర్శకుడు అజయ్ భూపతి ఎంచుకున్న లవ్ అండ్ ఫ్యాక్షన్ బ్యాక్‌డ్రాప్ బాగుంది. సంగీత దర్శకుడు జీవి ప్రకాష్ కుమార్ అందించిన పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమా స్థాయిని పెంచాయి. ముఖ్యంగా స్క్రీన్ పై పాటలు మరింత రిచ్‌గా కనిపిస్తాయి.







# లెనిన్ సరికొత్త రికార్డులు

## వందకోట్ల క్లబ్బులో అఖిల్ లెనిన్ చేరిక

టాలీవుడ్ యువ సామ్రాట్ అఖిల్ అక్కినేని కెరీర్‌లో ఓ సరికొత్త చరిత్రాత్మక అధ్యాయం మొదలైంది. ఆయన నటించిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ లెనిన్ చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతాలు సృష్టిస్తూ, ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్ల మైలురాయిని విజయవంతంగా అధిగమించింది. దీంతో అఖిల్ కెరీర్‌లో తొలి బ్లాక్ బస్టర్‌ను నమోదు చేయడంతో పాటు తొలి రూ.100 కోట్ల సినిమాగా రికార్డుల కెక్కింది. జూలై 10న భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా, తొలి ఆట నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుని బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించింది. దర్శకుడు మురళి కిషోర్ అబ్బూరు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ముఖ్యంగా సినిమాలో అఖిల్ కొత్త మేకోవర్, పవర్ ప్యాక్డ్ మాస్ యాక్షన్ సీక్వెన్స్‌లు, హై-ఓల్టేజ్ ఎమోషనల్ సన్నివేశాలు థియేటర్లలో ప్రేక్షకులను కట్టిపడేశాయి. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని నిర్మించాయి. నిర్మాత నాగవంశీ, నాగార్జున అనుసరించిన పబ్లిసిటీ వ్యూహాలు సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయి. ఇక తమ అభిమాన హీరో అఖిల్ ఖాతాలో తొలి బి÷-గగెస్ట్ బ్లాక్‌బస్టర్ హిట్ పడటంతో అక్కినేని అభిమానులు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. సినిమా విజయాన్ని పురస్కరించుకుని చిత్ర యూనిట్ కూడా సంతోషం వ్యక్తం చేస్తూ ప్రేక్షకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# విశ్వంభరతో పోటీ పడనున్న జైలర్-2

అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకోవడానికి ఆయన అభిమానులు ఇప్పటినుంచే ఇప్పటి నుంచే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అయితే ఆగష్టు 22న రానున్న మెగాస్టార్ బర్త్ డే కానుకగా ఆయన నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ సోషియో-ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' నుంచి అదిరిపోయే అప్‌డేట్ రాబోతున్నట్లు తెలుస్తుంది. దర్శకుడు మల్లిడి వశిష్ట తెరకెక్కిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం, విజువల్ ఎఫెక్ట్స్ పనుల కారణంగా ఇంతకాలం ఆలస్యం అయినప్పటికీ, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను శరవేగంగా ముగింపు దశకు తీసుకువచ్చింది. యూవీ క్రియేషన్స్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో అందాల తార త్రిష నటిస్తుండగా, ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి అద్భుతమైన బాణీలు, నేపథ్య సంగీతాన్ని అందిస్తున్నారు. కాగా, ఈ సోషియో-ఫాంటసీ అడ్వెంచర్‌ను దసరా పండుగకు టా÷-గ్గ÷ట్ చేస్తూ అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన ఆగస్టు 22న చిరంజీవి జన్మదిన వేడుకల సందర్భంగా చిత్రబృందం ప్రకటించబోతున్నట్లు సమాచారం. అయితే చిరంజీవి దసరా పండుగకు రాబోతుండటం అంతకంటే ఒక్కరోజు ముందుగానే రజనీకాంత్ జైలర్ 2 ప్రేక్షకులు రాబోతుండడంతో ఈ రెండు సినిమాలకు బాక్సాఫీస్ వద్ద బిగ్ క్లాష్ ఉండబోతున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ భారీ పోటీతో టాలీవుడ్ వర్సెస్ కోలీవుడ్ బాక్సాఫీస్ వార్ తారాస్థాయికి చేరడం ఖాయమని ట్రేడ్ నిపుణులు భావిస్తున్నారు.

# టైమ్ సెన్స్ లో సౌత్‌కు మార్కులేసిన కాజల్

ఇండియన్ సినీ ఇండస్ట్రీలో భాషల మధ్య పోటీ ఎంత పెరుగుతుందో, వర్క్ కల్చర్ మరియు కథల ఎంపికలపై డిస్కషన్ కూడా అంతే వేగంగా ముందుకు సాగుతోంది. ముఖ్యంగా సౌత్ సినీ ఇండస్ట్రీలో సమయపాలన, ప్రొఫెషనల్ వాతావరణం, హీరోయిన్ల క్యారెక్టర్ రైటింగ్ లో కనిపిస్తున్న మార్పులు ఇప్పుడు జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారుతున్నాయి. ప్రముఖ నటి కాజల్ అగర్వాల్ తాజా కామెంట్స్ ఈ రెండు అంశాలను మరోసారి హైలైట్ చేశాయి. సినీ నిర్మాణంలో టైమ్ అనేది ఎంతో కీలకమైనది. ఒక షూటింగ్ షెడ్యూల్ ఆలస్యమైతే దాని ఎఫెక్ట్ నటీనటుల డేట్స్ నుంచి టెక్నికల్ టీమ్ వర్క్ అవర్స్ వరకు విస్తరిస్తుంది. ఈ నేపథ్యంలో సౌత్ ఇండస్ట్రీలో షెడ్యూల్‌కు కట్టుబడి పనిచేసే విధానం, బాలీవుడ్‌లో తరచుగా కనిపించే ఆలస్యాల సంస్కృతి మధ్య తేడాపై కాజల్ చేసిన కామెంట్స్ ప్రొడక్షన్ ఎఫిషియెన్సీపై కొత్త డిస్కషన్ కు దారితీశాయి. టైమ్ సెన్స్ అనేది కేవలం వ్యక్తిగత అలవాటుగా కాకుండా, మొత్తం సినిమా నిర్మాణ వ్యవస్థ సామర్థ్యాన్ని డిసైడ్ చేసే అంశంగా ఇండస్ట్రీ వర్గాలు భావిస్తాయి. అయితే ఆమె కామెంట్స్ కేవలం వర్క్ కల్చర్‌కే పరిమితం కాలేదు. కెరీర్ ఎంపికల విషయంలో కూడా ఎన్ని సినిమాలు చేశామనే నెంబర్ కంటే క్వాలిటీకే ప్రాధాన్యం ఇచ్చానని చెప్పడం గమనార్హం. సౌత్ లో తనకు వచ్చిన క్యారెక్టర్లు నటిగా సంతృప్తినిచ్చాయని, అందుకే సాధారణ పాత్రల కంటే స్ట్రాంగ్ స్టోరీలను సెలెక్ట్ చేసుకున్నాననే భావన ఆమె మాటల్లో కనిపించింది. పైగా గత కొన్నేళ్లుగా సౌత్ సినిమాల్లో మహిళా పాత్రల రచనలో గణనీయమైన మార్పు కనిపిస్తోంది. ఒకప్పుడు హీరో చుట్టూ తిరిగే పాత్రలకే పరిమితమైన కథనాల్లో ఇప్పుడు హీరోయిన్లకు స్వతంత్ర ప్రయాణం, ఎమోషనల్ స్ట్రెంగ్త్ వంటి అంశాలు చోటు చేసుకుంటున్నాయి. ఫ్యామిలీ స్టోరీస్, థ్రిల్లర్లు, పీరియాడిక్ డ్రామాలు, యాక్షన్ సినిమాలు అన్న తేడా లేకుండా హీరోయిన్ క్యారెక్టర్లు కథను ముందుకు నడిపించే స్థాయికి చేరుకుంటున్నాయి.

PRINTED, PUBLISHED & OWNED By Rolla Raghunath Reddy, PRINTED at Teja Cards & Stationery (Printing & Stationery Supplyers) #78-1-26, Thunnuguntla Vari Street Lalapeta, Guntur - 522001.
EDITOR : Rolla Raghunath Reddy, #4-6-13, Library Road, Koritipadu 1st Lane, Near RCM School, Chandramoulinagar Guntur - 522007. Andhra Pradesh. E-mail: bharathprathinidhi@gmail.com Phone No: 8121214342